పత్రికతో.. మార్పులు

APTEL/25/A1880

# TN తెలుగు న్యూస్

దిన పత్రిక

మా కలం మీ గళం.. సామాన్యుని గుండె చప్పుడు..

సంపుటి : 1 సంచిక : 700 పబ్లిషర్స్ & చీఫ్ ఎడిటర్ : యన్. కృష్ణారావు ఎడిటర్ : ఎస్. మస్తాన్ శుక్రవారం 28.08.2026 పేజీలు : 7 వెల : 4/-


## సీఆర్‌డీఏ భేటీ

# ఒలింపిక్స్ వేదికగా అమరావతి

### పలు ప్రతిపాదనలకు గ్రీన్ సిగ్నల్

- 2036లో నిర్వహణకు భారత్ పోటీ
- దేశానికి అవకాశం వస్తే అమరావతి మంచి వేదిక అవుతుంది
- సీఆర్‌డీఏ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు



అమరావతి, ఆగస్టు 27 : అమరావతి: భారత్ 2036లో ఒలింపిక్ క్రీడలు నిర్వహించేందుకు పోటీ పడుతోందని, మన దేశానికి ఆ అవకాశం వస్తే... వాటి నిర్వహణకు అత్యంత అనువైన ప్రదేశంగా అమరావతిలో ప్రతిపాదిత స్పోర్ట్స్‌సిటీని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. అమరావతిలో రైతులకు లేఔట్లు వేసేందుకు, ప్రధాన మౌలిక వసతులు, ప్రభుత్వ భవనాల నిర్మాణం వంటి అవసరాలకు పోగా సీఆర్‌డీఏ వద్ద 3,800 ఎకరాలు మాత్రమే ఉందని.. దాన్ని పొదుపుగా వాడుకోవాలని పేర్కొన్నారు. ఇకపై వివిధ సంస్థలకు కేటాయింపుల్ని ఆచితూచి చేయాలని స్పష్టం చేశారు. అమరావతి ఔటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్ఆర్) నిర్మిస్తే... హైదరాబాద్ తరహాలో దాన్ని ఆనుకుని శాటిలైట్ టౌన్‌షిప్‌లు అభివృద్ధి చెందుతాయన్నారు. హైటెక్ సిటీ ప్రాంతంలో ఒకప్పుడు రూ.లక్షల్లో ఉన్న ఎకరం భూమి విలువ ఇప్పుడు రూ.250 కోట్ల వరకు పలుకుతోందని, అమరావతిలో భూములకూ భవిష్యత్తులో గణనీయంగా విలువ పెరుగుతుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన సీఆర్‌డీఏ 65వ సమావేశం గురువారం సచివాలయంలో జరిగింది. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను పురపాలకశాఖ మంత్రి నారాయణ విలేకర్లకు వెల్లడించారు. ముఖ్యాంశాలివీ.. రూ.536 కోట్లతో సెంట్రలైజ్డ్ లైబ్రరీ, ఆడిటోరియం: అమరావతిలోని శాఖమూరు వద్ద రూ.596 కోట్లతో సెంట్రల్ లైబ్రరీ, ఆడిటోరియం, హెచ్ఆర్ భవనాల తరువాయి 2లో




## హైదరాబాద్ నడిబొడ్డున

# తొలి గేటెడ్ కమ్యూనిటీ

2లో



- ఏఎస్‌బీఎల్ భారీ ప్రాజెక్ట్
- ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో 'ఏఎస్‌బీఎల్ లెగసీ' పేరిట భారీ ప్రాజెక్ట్ ప్రారంభం
- 7.97 ఎకరాల్లో 50 అంతస్తులతో మూడు ఆకాశహర్మ్యాల నిర్మాణం
- 50కి పైగా ఆధునిక సౌకర్యాలతో 3, 4 బీహెచ్‌కే ఫ్లాట్లు
- స్టాండలోన్ భవనాలకు భిన్నంగా కొత్త జీవనశైలిని పరిచయం చేయడమే లక్ష్యం



## 43.71 లక్షల మంది

# ఓటర్లకు నోటీసులు

- వీరిలో 16.23 లక్షల మంది విచారణ పూర్తి
- 8,764 మంది అనర్హులుగా గుర్తింపు
- పెండింగ్‌లో మరో 27.41 లక్షల మంది ఓటర్ల విచారణ
- కొనసాగుతున్న 'సర్'

2లో



## మంగళగిరిలో మోడరన్ రైతు బజార్

# శంకుస్థాపన చేసిన మంత్రి

- రూ.18.55 కోట్ల వ్యయంతో 5.90 ఎకరాల్లో మార్కెట్ నిర్మాణం
- అరబిందో ఫార్మా ట్రస్ట్ సీఎస్ఆర్ నిధులతో ఈ ప్రాజెక్టుకు శ్రీకారం
- రిటైల్, హోల్ సేల్ స్టాళ్లు, కోల్డ్ స్టోరేజీతో కూడిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్



- మంగళగిరిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దే ప్రణాళికలో భాగంగా ఈ నిర్మాణం

2లో

## కాన్పూర్‌లో కూలిన శిక్షణ విమానం..

### ఇద్దరు పైలట్లు మృతి

- యూపీలోని కాన్పూర్‌లో విమాన ప్రమాదం
- ప్రమాదంలో పైలట్, కో-పైలట్ అక్కడికక్కడే మృతి
- గంగా నది సమీపంలోని పొలాల్లో కూలిన విమానం
- నియంత్రణ కోల్పోవడంతోనే ప్రమాదం జరిగిందని అంచనా



ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో గురువారం ఘోర విమాన ప్రమాదం సంభవించింది. ఒక ట్విన్ ఇంజిన్ శిక్షణ విమానం గంగా నది సమీపంలోని వ్యవసాయ క్షేత్రాల్లో కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో విమానంలో ఉన్న పైలట్, కోపైలట్ ఇద్దరూ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. శిక్షణలో భాగంగా గగనతలానికి ఎగిరిన ఈ విమానం, కొద్దిసేపటికే సాంకేతిక లోపం లేదా ఇతర కారణాలతో నియంత్రణ కోల్పోయి నేరుగా పొలాల్లో కూలిపోయినట్లు అధికారులు ప్రాథమికంగా వెల్లడించారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, తరువాయి 2లో

## ఉజ్బెకిస్థాన్, కిర్గిస్థాన్‌లకు మోదీ



- రేపట్నుంచి నాలుగు రోజుల విదేశీ పర్యటన

2లో

### అమెరికా వీసా

## ఇంటర్వ్యూల నిలిపివేత

# మేటవేసిన మృత్యువు

- నేపాల్‌లో 392కు పెరిగిన మృతుల సంఖ్య
- 30 దేశాలకు చెందిన 1500 మంది గల్లంతు!
- వారిలో 288 మంది భారతీయులు
- కొందరు తెలుగువారూ..
- టిబెట్‌లోనూ భారీ విధ్వంసం
- కన్నీరు మిగిల్చిన వరద, బురద
- అంచనాలకందని నష్టం
- కొనసాగుతున్న సహాయక చర్యలు
- భారీ సాయం పంపిన భారత్



కాఠ్మాండూ: నేపాల్‌లో ఎక్కడ చూసినా వరద విధ్వంసక దృశ్యాలే దర్శనమిస్తున్నాయి. గురువారం వెలుగులోకి వచ్చిన వీడియోల్లోని దృశ్యాలు మరింత భయానకంగా ఉన్నాయి. రసువా జిల్లాలో కొన్ని అడుగుల ఎత్తున మొదలైన వరద, బురద ప్రవాహం పోటెత్తి.. దిగువకు ప్రవహించి.. పలు జిల్లాల్లో బీభత్సం సృష్టించింది. పలు భవనాలు పేకమేడల్లా కూలిపోయాయి. వాహనాలు కాగితపు పడవల్లా కొట్టుకుపోయాయి. పరుగెత్తుతున్న ప్రజలను వరద కమ్మేసింది. జంతువులు, చెట్లు వరదలో కలిసిపోయాయి. భూకంపంతో మంచు, రాళ్లు, శిథిలాలు కొట్టుకొచ్చి లిండే నదిలో ప్రవాహానికి తాత్కాలికంగా అడ్డుపడ్డాయి. అడ్డంకి తొలగిపోగానే అది ఉప్పెనై భారీగా వరద, బురద దిగువకు పోటెత్తింది. అది భోటే కోశీ, త్రిశూలి నదుల ప్రవాహాన్ని బీభత్సం చేసింది. టిబెట్‌లోనూ వరద భారీ విధ్వంసం సృష్టించింది. భవనాలకు భవనాలే నేలమట్టమయ్యాయి. తరువాయి 2లో

# సీఆర్‌డీఏ భేటీ ఒలింపిక్స్ వేదికగా అమరావతి

(మొదటిపేజీ తరువాయి)

నిర్మాణానికి అనుమతి. రాజధానిలోని 29 గ్రామాల్లో రోడ్లు, డ్రెయిన్లు, యూజీడీ, నీటి సరఫరా లైన్‌లు, విద్యుత్ సరఫరా వ్యవస్థల అభివృద్ధికి మరో రూ.533 కోట్లు వెచ్చించేందుకు అథారిటీ ఆమోదం తెలిపింది. రాజధాని గ్రామాల్లోని ప్రజలకు తలసరి 135 లీటర్ల నీరు సరఫరా చేసేందుకు వీలుగా కొత్త పైప్‌లైన్‌లు వేయడం వంటి పనులు చేపడతారు. ప్రధాన రహదారులు రాజధాని గ్రామాల మీదుగా వెళ్లడం వల్ల భూమి కోల్పోయినవారికి... స్థలాలు ఇచ్చిన లేఔట్లలోనూ మౌలిక వసతుల్ని ఈ నిధులతో అభివృద్ధి చేయనున్నారు. ఎల్‌పీఎస్ లేఔట్లలో బీటీ రోడ్లు: రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు స్థలాలు కేటాయించిన (ఎల్‌పీఎస్) లేఔట్లలో సీసీ రోడ్ల కంటే బీటీ రహదారులే మేలని దిల్లీలోని సీఆర్‌ఆర్‌ఐ, ఖరగ్‌పూర్ ఐఐటీ చేసిన సూచనలకు అథారిటీ ఆమోదం. మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్‌కు రాజధాని అమరావతి నుంచి తాగునీటి సరఫరాకు అనుమతి. కిలోలీటర్ (వెయ్యి లీటర్ల)కు రూ.10 చొప్పున కార్పొరేషన్ నుంచి వసూలు చేయాలని నిర్ణయం. రాజధానిలో డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టమ్‌కు సంబంధించిన ముసాయిదా మాస్టర్‌ప్లాన్ తయారీకి అనుమతి. మిక్స్‌డ్‌యూజ్ ప్రాజెక్టులకు స్థలాలు: రాజధానిలో మిక్స్‌డ్‌యూజ్ ప్రాజెక్టుల నిమిత్తం పిచ్చుకలపాలెంలో 7.9, తుళ్లూరులో 5, మందడంలో 18.38, కురగల్లులో 6 ఎకరాల చొప్పున మొత్తం 42 ఎకరాలు కేటాయించేందుకు అనుమతి. ఆసక్తిగల సంస్థల నుంచి బిడ్‌లు ఆహ్వానించాలని నిర్ణయం. రాజధానిలో ఇప్పటికే స్థలాలు పొందిన హోటళ్లు, అంతర్జాతీయ పాఠశాలల వంటి వాటికి కేటాయించిన స్థలాల్ని ఆనుకుని ఉన్న చిన్న చిన్న స్థలాల్ని కూడా అక్కడి బేసిక్ విలువపై 250 శాతం చెల్లిస్తే వాటికి కేటాయించేందుకు అథారిటీ అనుమతి. రాజధానిలో ఎకరం బేసిక్ విలువ రూ.4.1 కోట్లు ఉంది. దానిపై 250 శాతం అంటే ఎకరానికి రూ.10.25 కోట్లకు తగ్గకుండా చెల్లిస్తే ఆ స్థలాల్ని కేటాయిస్తారు. రాజధానిలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డీమ్డ్ యూనివర్సిటీ ఏర్పాటుకు 8.5 ఎకరాల కేటాయింపు. రెండు గ్రామాల్లో భూసమీకరణ: రాజధాని ఇన్నర్‌రింగ్ రోడ్డు, రైల్వే ట్రాక్.. తాడికొండ, కంతేరు గ్రామాల మీదుగా వెళుతోంది. ఆ గ్రామాల్లో ఇన్నర్ రింగ్‌రోడ్డు, రైల్వే ట్రాక్‌లకు... అమరావతికి మధ్యనున్న భూముల్ని భూసమీకరణలో తీసుకునేందుకు అథారిటీ అనుమతి. రాజధానిలో రెండో దశలో భూసమీకరణ చేస్తున్న గ్రామాల్లో రైతులకు కుటుంబానికి రూ.1.50 లక్షల చొప్పున రుణమాఫీకి అనుమతి. 2026 జనవరి 6కి ముందు తీసుకున్న రుణాలకు మాత్రమే వర్తింపు.

**నెల రోజుల్లో రూ.వెయ్యి కోట్ల పనులు**

రాజధానిలో నిర్మాణ పనుల్ని వేగవంతం చేయాలని గుత్తేదారు సంస్థల ప్రతినిధులతో సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. గతంతో పోలిస్తే పనులు కొంత వేగం పుంజుకున్నాయన్నారు. గత నెల రోజుల్లో రూ.వెయ్యి కోట్ల విలువైన పనులు జరిగాయని అధికారులు వివరించారు.

## ఉజ్బెకిస్థాన్, కిర్గిస్థాన్‌లకు మోదీ

దిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక ద్వైపాక్షిక, బహుపాక్షిక సమావేశాలకు సిద్ధమవుతున్నారు. ఈ నెల 29 నుంచి సెప్టెంబరు 1 వరకు ఉజ్బెకిస్థాన్, కిర్గిస్థాన్‌లలో మోదీ పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా కిర్గిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో జరిగే షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) సదస్సులో పాల్గొని, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో మోదీ ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ఈ భేటీలో ఇరు దేశాల మధ్య ఉన్న ద్వైపాక్షిక సంబంధాలను నేతలిద్దరూ సమగ్రంగా సమీక్షించనున్నారని విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి సిబీ జార్జ్ తెలిపారు. కిర్గిస్థాన్ అధ్యక్షుడు సాదిర్ జాపరోవ్ ఆహ్వానం మేరకు ఎస్‌సీవో సదస్సుకు హాజరవుతున్న మోదీ చివరిరోజు ప్లీనరీలో ప్రసంగిస్తారు. ఎస్‌సీవో దేశాల ఇతర నేతలతో కలిసి ఆరో వరల్డ్ నోమాడ్ గేమ్స్ ప్రారంభ వేడుకలకు మోదీ హాజరవుతారు. ఎస్‌సీవో సదస్సుకు పుతిన్‌తోపాటు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తదితరులు హాజరయ్యే అవకాశముంది. 2017 నుంచి భారత్ పూర్తిస్థాయి సభ్య దేశంగా ఉన్న ఈ శిఖరాగ్ర సదస్సు 25వ వార్షికోత్సవాన్ని జరుపుకోనుంది. కిర్గిస్థాన్ కంటే ముందు 29, 30 తేదీల్లో ఉజ్బెకిస్థాన్‌లో ప్రధాని పర్యటిస్తారు. ఆ దేశ అధ్యక్షుడు షౌకత్ మిర్జియోయెవ్ ఆహ్వానం మేరకు తాష్కెంట్‌కు వెళతారు. ఇది ఉజ్బెకిస్థాన్‌లో మోదీకి నాలుగో పర్యటన. తాష్కెంట్‌లో మిర్జియోయెవ్‌తో మోదీ ప్రతినిధి స్థాయి చర్చలు జరపనున్నారు. భారత్ ఉజ్బెకిస్థాన్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడమే ఈ చర్చల ప్రధాన ఉద్దేశం. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, డిజిటల్ కనెక్టివిటీ, ఇంధనం, విద్య, ప్రజల మధ్య సంబంధాలు వంటి అంశాలపై ఇరు దేశాల నేతలు చర్చించనున్నారు. తాష్కెంట్‌లో శాస్త్రి మెమోరియల్, తాష్కెంట్ స్టేట్ యూనివర్సిటీ ఆఫ్ ఓరియంటల్ స్టడీస్‌లోని మహాత్మాగాంధీ కేంద్రాన్ని మోదీ సందర్శించనున్నారు.

## 43.71 లక్షల మంది ఓటర్లకు నోటీసులు

అమరావతి: 'సర్' ప్రక్రియలో భాగంగా ఓటర్లు వారి ఎన్యూమరేషన్ పత్రాల్లో పేర్కొన్న వివరాల్లో లోపాలున్నాయంటూ రాష్ట్రవ్యాప్తంగా 43.71 లక్షల మందికి ఎన్నికల సంఘం అధికారులు నోటీసులివ్వగా.. వీరిలో 16.23 లక్షల మంది విచారణ గురువారం సాయంత్రానికి పూర్తైంది. వారిలో 8,764 మంది తగిన పత్రాలు సమర్పించకపోవడంతో అనర్హులుగా తేల్చారు. 13,63,250 మందిని తుదిజాబితాలో కొనసాగించేందుకు నిర్ణయించారు. మిగతా 2,51,760 మంది ఓటర్లకు సంబంధించి వారు సమర్పించిన ఆధారాల పరిశీలన కొనసాగుతోంది. నోటీసులు అందుకున్న మరో 27.47 లక్షల మంది ఓటర్లను ఇంకా విచారించాల్సి ఉంది. సెప్టెంబరు 28వ తేదీలోగా ఈ విచారణ పూర్తికావాలి. అప్పుడే నోటీసులు అందుకున్న ఓటర్లలో ఎంతమంది తుది జాబితాలో మిగులుతారనే దానిపై స్పష్టత రానుంది. అయితే నోటీసులు అందుకున్న ఓటర్లకు తహసీల్దార్ కార్యాలయాల వద్దకు విచారణకు రావాలని బీఎల్‌వోలు చెబుతుండటంతో వారంతా పనులు మానుకుని అక్కడ పడిగాపులు పడుతున్నారు. నోటీసులకు స్పందనగా ఏయే పత్రాలు సమర్పించాలనే దానిపై ఓటర్లకు సరైన అవగాహన ఉండట్లేదు. బీఎల్‌వోలూ సరిగ్గా సహకరించకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

**తప్పిదాలు, లోపాలతో వివరాలు**

* సర్ నిబంధనల ప్రకారం ప్రస్తుత జాబితాలోని ఓటర్లు 2002 నాటి జాబితాలోని తమ పేరు లేదా తల్లిదండ్రుల పేర్లు లేదా తాత, నాన్నమ్మల పేర్లు, వివరాలతో మ్యాచింగ్ చేసుకోవాలి. బీఎల్‌వోలకు సమర్పించిన ఎన్యూమరేషన్ పత్రాల్లో చాలామంది ఓటర్లు తమ వివరాలను మ్యాచింగ్ చేయకుండా వదిలేశారు. మరికొందరు తప్పిదాలు, లోపాలతో కూడిన వివరాలతో మ్యాచింగ్ చేసుకున్నారు. ఇలాంటి వారు మొత్తం 44.23 లక్షల మంది ఉన్నట్లు గుర్తించిన ఎన్నికల సంఘం అధికారులు వారందరికీ నోటీసులు సిద్ధం చేశారు. వారిలో 43.71 లక్షల మందికి ఇప్పటివరకూ నోటీసుల పంపిణీ పూర్తయింది. నోటీసులు అందుకున్న వారిలో 36 లక్షల మంది తప్పిదాలు, లోపాలతో మ్యాచింగ్ చేసుకున్నవారే.
* ఎన్యూమరేషన్ పత్రాల్లో ఓటరు పేర్కొన్న వివరాల్లో తల్లిదండ్రులు, పిల్లల మధ్య వయసు తేడా 15 ఏళ్లకంటే తక్కువ, 50 ఏళ్ల కంటే ఎక్కువ, ఓటరుతాత లేదా నానమ్మల మధ్య వయసు తేడా 40 ఏళ్ల కంటే తక్కువ వంటి లోపాలున్నాయి.

ప్రస్తుత జాబితాలోని ఓటరు తండ్రి పేరు, 2002 నాటి జాబితాలోని ఓటరు తండ్రి పేరులో తేడా, ఒకే తల్లిదండ్రులకు చెందిన పిల్లల మధ్య వయసు తేడా 9 నెలల కంటే తక్కువగా ఉండటం వంటి తప్పిదాలున్నాయి. ప్రస్తుత జాబితాలోని ఓటరు పేరు, 2002 నాటి జాబితాలోని ఓటరు పేర్లలో తేడా, సమర్పించిన తల్లిదండ్రుల వివరాల్లో తప్పులున్నాయి. ఇలాంటి వారికి ఇప్పుడు నోటీసులిచ్చి విచారణకు పిలుస్తున్నారు.

### అమెరికా వీసా
## ఇంటర్వ్యూల నిలిపివేత

వాషింగ్టన్: అమెరికాకు వలసలను నియంత్రించడంపై దృష్టిపెట్టిన ట్రంప్ సర్కారు.. ప్రపంచవ్యాప్తంగా అన్ని ఇమిగ్రెంట్ వీసా ఇంటర్వ్యూలను తాత్కాలికంగా నిలిపివేసింది. వీసా నిబంధనలను మరింత కఠినతరం చేయడం, స్థానిక ప్రభుత్వం నుంచి అందే ప్రయోజనాలపై ఆధారపడే అవకాశమున్నవారి రాకను అడ్డుకోవడమే లక్ష్యంగా ఈ చర్యకు ఉపక్రమించింది. ఓ వార్తాసంస్థ తాజాగా వెల్లడించిన వివరాల ప్రకారం వీసా దరఖాస్తులను సమగ్రంగా, నిలకడగా మదింపు చేయడంపై తమ కాన్సులర్ అధికారులకు అమెరికా ప్రస్తుతం ప్రత్యేక శిక్షణ అందిస్తోంది. 'పబ్లిక్ ఛార్జ్' నిర్వచనం పరిధిలోకి వచ్చే వ్యక్తులను గుర్తించడమెలాగో వారికి తర్ఫీదునిస్తోంది. ఆర్థిక మద్దతు కోసం ప్రధానంగా ప్రభుత్వంపై ఆధారపడేవారిని అమెరికా 'పబ్లిక్ ఛార్జ్'గా పరిగణిస్తుంటుంది. వలస వచ్చే విదేశీయుల్లో ఇలాంటి వారుంటే.. అర్హులైన అమెరికన్లకు ప్రభుత్వ ప్రయోజనాలు తక్కువగా అందుతాయని ట్రంప్ సర్కారు భావిస్తోంది. ఈ నేపథ్యంలో 'పబ్లిక్ ఛార్జ్'గా మారే అవకాశమున్న దరఖాస్తుదారులను గుర్తించడంపై ప్రత్యేక దృష్టిపెట్టింది. కాన్సులర్ అధికారులకు శిక్షణ కొనసాగుతుండటంతో.. ప్రపంచవ్యాప్తంగా అన్ని ఎంబసీలు, కాన్సులేట్లలో ఇమిగ్రెంట్ వీసా ఇంటర్వ్యూలను తాత్కాలికంగా నిలిపివేసింది. వాటన్నింటినీ రీషెడ్యూలు చేస్తామని.. కొత్త అపాయింట్‌మెంట్ల తేదీలను దరఖాస్తుదారులకు త్వరలో తెలియజేస్తామని పేర్కొంది. 'పబ్లిక్ ఛార్జ్'గా మారతారన్న ఆందోళనతో పలు దేశాల ప్రజలకు ఇమిగ్రెంట్ వీసాలు మంజూరు కాకుండా ట్రంప్ సర్కారు కొన్నాళ్లుగా ప్రయత్నాలు చేస్తున్న సంగతి గమనార్హం.

**అదనపు ఫీజుతో అమెరికాకే నష్టం**

హెచ్1బీ వీసాలపై 1,03,265 డాలర్ల అదనపు ఫీజు భారం మోపేందుకు ట్రంప్ సర్కారు చేసిన నూతన ప్రతిపాదన అమెరికాకే నష్టం కలిగించే ముప్పుందని భారతీయ అమెరికన్ అడ్వొకసీ గ్రూప్ 'ద ఫౌండేషన్ ఫర్ ఇండియా అండ్ ఇండియన్ డయాస్పొరా స్టడీస్ (ఎఫ్‌ఐఐడీఎస్)' పేర్కొంది. ఈ రుసుము కారణంగా హై వాల్యూ ఉద్యోగాలు అమెరికా నుంచి విదేశాలకు తరలిపోతాయని అభిప్రాయపడింది.

(మొదటిపేజీ తరువాయి)

## మరణ మృదంగం

నేపాల్‌లో బుధవారం సంభవించిన విపత్తులో మరణించిన వారి సంఖ్య 389కి చేరుకుంది. మరో 910 మందికిపైగా గల్లంతయ్యారు. టిబెట్‌లో ముగ్గురు మృతి చెందగా.. 558 మంది గల్లంతయ్యారు. గురువారంనాటికి మరణాలు 392గా, గల్లంతైనవారు 1,468గా తేలారు. నేపాల్‌లో 288 మంది భారతీయుల జాడ తెలియడం లేదని భారత విదేశీ వ్యవహారాలశాఖ వెల్లడించింది. ఇందులో తెలుగువారూ ఉన్నారు. మరో 200 మంది టిబెట్ భూభాగంలో చిక్కుకుపోయారని తెలిపింది. స్మార్ట్ ట్రావెల్స్‌ద్వారా 37 మంది, ఫ్లై ఎవరెస్టు ట్రావెల్ సంస్థద్వారా 49 మంది తమిళనాడుకు చెందినవారు మానసరోవర్ యాత్రకు వెళ్లారని, వారి ఆచూకీ తెలియడం లేదని విదేశీ వ్యవహారాలశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జయస్వాల్ తెలిపారు. కర్ణాటక నుంచి వెళ్లిన 13మంది ఆచూకీ అందలేదు. 590 మంది పర్యాటకుల జాడ తెలియడం లేదని, అందులో 476 మంది విదేశీయులు, 114 మంది నేపాలీలు ఉన్నారని నేపాల్ పర్యాటకశాఖ వెల్లడించింది. 30 దేశాలకు చెందిన యాత్రికులు ఇందులో ఉన్నారని పేర్కొంది. నేపాల్‌లో ఇప్పటిదాకా 389 మృతదేహాలు లభ్యమయ్యాయి. చితవాన్ జిల్లాలో మరణ మృదంగం మోగింది. అక్కడ ఏకంగా 132 మృతదేహాలను సహాయక సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. తూర్పు నవాల్‌పరసీలో 62, ధాడింగ్‌లో 27, గూర్ఖాలో 20, రసువాలో 17, పశ్చిమ నవాల్‌పరసీలో 15, నువాకోట్‌లో 12 మృతదేహాలు లభ్యమయ్యాయి. వేల కుటుంబాలు ఇళ్లను కోల్పోయాయని, అందులో చాలా మంది గల్లంతయ్యారని నేపాల్ విదేశాంగశాఖ మంత్రి శిశిర్ ఖనల్ తెలిపారు. జల విద్యుత్తు ప్రాజెక్టులు, కస్టమ్స్ కార్యాలయాల్లో పనిచేస్తున్న 160 మంది జాడ తెలియడం లేదు.

**భారీ విధ్వంసం**

వరద, బురద ముంచెత్తడంతో మధ్య నేపాల్‌లో 35 వంతెనలు, 45 సస్పెన్షన్ వంతెనలు, 40 కిలోమీటర్ల రోడ్లు ధ్వంసమయ్యాయి.

## మేటవేసిన మృత్యువు

కాఠ్‌మాండూను ఇతర ప్రాంతాలతో కలిపే రహదారి తీవ్రంగా దెబ్బతింది. టిబెట్‌లో: టిబెట్‌లో 558 మంది గల్లంతయ్యారు. వీరిలో 260 మంది విదేశీయులున్నారు. మిగిలిన 100 మంది స్థానికులు. దెబ్బతిన్న ప్రాంతాలను గురువారం చైనా ప్రధాని లీ కియాంగ్ సందర్శించారు.

*** 11 మంది భారతీయులను రక్షించిన సిబ్బంది**

ఇప్పటిదాకా 84 మంది భారతీయులను సురక్షిత ప్రదేశాలకు చేర్చామని భారత విదేశీ వ్యవహారాలశాఖ వెల్లడించింది. ఇందులో త్రిశూల్ విద్యుత్తు ప్రాజెక్టువద్ద పనిచేసే 63 మంది ఉద్యోగులున్నారు. 27 మంది విదేశీ పర్యాటకులను సహాయక సిబ్బంది రక్షించారు. వారిలో 11 మంది భారతీయులున్నారు. కాఠ్‌మాండూలోని త్రిభువన్ ఆసుపత్రివద్ద వందల మంది గుమికూడారు. తమవారి ఆచూకీ కోసం అన్వేషిస్తూ కనిపించారు. బుధవారం నుంచి 47.5 టన్నుల అత్యవసర సామగ్రిని నేపాల్‌కు భారత్ పంపింది. విపత్తు పరిస్థితిపై విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి జైశంకర్ సమీక్ష జరిపారు.

**పొంచి ఉన్న మరో ముప్పు?**

కాఠ్‌మాండూ: నేపాల్‌కు మరో వరద ముప్పు పొంచి ఉందని చైనా హెచ్చరిస్తోంది. భోటే కోశీ నదికి దిగువనున్న రసువా జిల్లాలో ఒక ఆనకట్ట తరహా ఆకృతి ఏర్పడిందని, అందులో భారీగా నీరు చేరుతోందని, అది మరింతగా పెరిగి.. రాబోయే 3 రోజుల్లో ఎప్పుడైనా బద్దలయ్యే అవకాశముందని అంటోంది. ఈ ప్రాంతం నేపాల్‌టిబెట్ సరిహద్దులో రెండు నదుల సంగమ ప్రదేశంవద్ద ఉంది. భోటే కోశీ, త్రిశూలి నదీ తీరాలకు ప్రజలు దూరంగా ఉండాలని, తాము తిరిగి చెప్పేవరకూ సురక్షిత ప్రాంతాలను వదిలి రావద్దని నేపాల్ ప్రభుత్వం అప్రమత్తం చేసింది.

### కాన్పూర్‌లో కూలిన శిక్షణ విమానం..
## ఇద్దరు పైలట్లు మృతి



ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో గురువారం ఘోర విమాన ప్రమాదం సంభవించింది. ఒక ట్విన్ ఇంజిన్ శిక్షణ విమానం గంగా నది సమీపంలోని వ్యవసాయ క్షేత్రాల్లో కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో విమానంలో ఉన్న పైలట్, కోపైలట్ ఇద్దరూ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. శిక్షణలో భాగంగా గగనతలానికి ఎగిరిన ఈ విమానం, కొద్దిసేపటికే సాంకేతిక లోపం లేదా ఇతర కారణాలతో నియంత్రణ కోల్పోయి నేరుగా పొలాల్లో కూలిపోయినట్లు అధికారులు ప్రాథమికంగా వెల్లడించారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అత్యవసర సేవల సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అయితే, ఈ ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో మరణించిన పైలట్ల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆ కుటుంబాలకు ఈ తీరని లోటును భరించే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని ఆయన ఆకాంక్షించారు. కాగా, ప్రమాద కారణాలపై అధికారులు ఇప్పటికే సమగ్ర దర్యాప్తు ప్రారంభించారు.

## మంగళగిరిలో మోడరన్ రైతు బజార్.. శంకుస్థాపన చేసిన మంత్రి లోకేశ్





మంగళగిరిని దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మరో కీలక ముందడుగు వేశారు. మంగళగిరి పట్టణంలోని నిడమర్రు రైల్వే గేట్ సమీపంలో రూ.18.55 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న అత్యాధునిక 'మోడరన్ రైతు బజార్' నిర్మాణ పనులకు ఆయన గురువారం భూమిపూజ చేసి, శంకుస్థాపన చేశారు. సుమారు 5.90 ఎకరాల విస్తీర్ణంలో ఈ ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను నిర్మించనున్నారు. అరబిందో ఫార్మా ఫౌండేషన్ తన కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల నుంచి ఈ ప్రాజెక్టుకు అవసరమైన ఆర్థిక సహకారాన్ని అందిస్తోంది. స్థానిక ప్రజలు, రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, ఈ రిటైల్, హోల్ సేల్ కూరగాయల మార్కెట్ నిర్మాణానికి మంత్రి లోకేశ్ శ్రీకారం చుట్టారు. మొత్తం 71,925 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఇందులో రిటైల్ మార్కెట్ విభాగంలో కూరగాయల విక్రయాల కోసం 102 స్టాళ్లు, పండ్లు, పూల కోసం 54 స్టాళ్లను కేటాయించారు. అలాగే, హోల్ సేల్ మార్కెట్ విభాగంలో 23 దుకాణాలు, 18 అన్‌లోడింగ్ ప్లాట్‌ఫామ్‌లను ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు కోల్డ్ స్టోరేజీ, కూరగాయలు ప్రక్షాళన కేంద్రాలు, క్యాంటీన్, వాహనాల పార్కింగ్ వంటి అత్యాధునిక సదుపాయాలను ఇక్కడ కల్పించనున్నారు. శంకుస్థాపన కార్యక్రమం నిమిత్తం విచ్చేసిన మంత్రి లోకేశ్‌కు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన శిలాఫలకాన్ని ఆవిష్కరించి, మార్కెట్ నమూనాను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అరబిందో ఫార్మా ట్రస్ట్ ప్రతినిధులు, స్థానిక టీడీపీ ముఖ్య నాయకులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## సంపాదకీయం

# కన్నవారే బాధితులుగా..
# నేటి తరం పోకడలు!

పిల్లలను కనగలం కానీ వారి తలరాతలను కనలేము అనేది పాత సామెత. కానీ, మనం కన్న పిల్లలే మన తలరాతను రాసే పరిస్థితి దాపురించింది. ఈ మధ్య రెండు తెలుగు రాష్ట్రాలలో సంచలనంగా మారిన రెండు ఉదంతాలను గమనిస్తే అందులో ఉన్న వాస్తవం అవగతమవుతుంది. వాటిలో ఒకటి రూపా రెడ్డి హత్య. ఇది అత్యంత దారుణమైన హత్య. సాధారణంగా మహిళలు ఇలాంటి హత్యలకు గురికావడం అరుదు. అందునా రూపా రెడ్డి ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నారు. ఆమె ఒక ప్రైవేటు పాఠశాల ప్రిన్సిపాల్. అటువంటి ఆమెను డబ్బు కోసం ఇద్దరు యుక్తవయస్కులు పక్కాగా ప్రణాళిక రచించి హతమార్చడం సామాన్యమైన విషయం కాదు. పోలీసుల కథనం ప్రకారం... ఫీజులు వసూలు చేసే రోజులు కావడంతో రూపా రెడ్డి ఇంట్లో డబ్బు ఉంటుందని తెలుసుకుని, ఐదు రోజులు రెక్కీ నిర్వహించి మరీ హత్య చేశారు. అయితే ఇక్కడ ఆలోచించవలసిన విషయం ఏమిటంటే... హత్య చేయటానికి ముందు పాఠశాల హాస్టల్‌లో ఆ ఇద్దరిలో ఒకరి వద్ద డబ్బు, సెల్ ఫోన్ దొరికినందుకు వారిని హాస్టల్ నుండి పంపించివేశారు. అలా హాస్టల్ నుండి ఇంటికి వచ్చిన తరువాత తల్లిదండ్రులు వారిని గమనించారో లేదో అర్థం కావటం లేదు. పరిశీలించినంత మాత్రాన వారి ఆలోచనలు మొత్తం తెలుస్తాయా అంటే... కొంతవరకైనా తెలిసే అవకాశం ఉంటుంది. హత్యకు ముందు ఐదు రోజులు వారు రెక్కీ నిర్వహించినట్లు చెబుతున్నారు. పదో తరగతి చదువుతూ, హాస్టల్ నుండి పంపించివేయబడిన పిల్లలు రోజంతా ఎక్కడికి వెళుతున్నారు అని తెలుసుకునే ప్రయత్నం తల్లిదండ్రులు చేయకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది.పిల్లలు ఇంట్లో ఉన్నట్లే బయట కూడా ఉంటారనుకోవడం పొరపాటు. వారి ఈడు పిల్లల దగ్గర వారు ఎంతో చురుగ్గా ఉంటారు. వారు తమ స్నేహితుల గురించి చెప్పే మాటలను బట్టే వారి ఇష్టాయిష్టాలు ఏమిటో అర్థమవుతాయి. కానీ వారి మాటలు వినే ఓపిక, తీరిక మనకు ఉండాలి. సెల్ ఫోన్ల పుణ్యమా అని తల్లిదండ్రులకు ఆ తీరికే ఉండటం లేదు. పిల్లల పెంపకంలో వారు అడిగినవన్నీ కొనివ్వడమే ప్రధాన బాధ్యతగా భావిస్తున్నారు. మంచి మార్కులు తెచ్చుకుంటే అడిగినవి కొనిస్తామని తల్లిదండ్రులు ఆశ పెడుతుంటే, కొనివ్వకపోతే ఏదో ఒకటి చేసుకుంటామని పిల్లలు బెదిరిస్తున్నారు. మొన్న మహారాష్ట్రలో సెల్ ఫోన్ కోసం ఓ బాలుడు కొండపై నుండి దూకుతానని బెదిరిస్తుంటే, అతడిని రక్షించే ప్రయత్నంలో తండ్రి కూడా కుమారుడితో పాటు లోయలోకి పడిపోయాడు. వారిద్దరినీ చూసిన ఆవేశంలో తల్లి కూడా దూకేసింది. ఒక్క సెల్ ఫోన్ కోసం మూడు నిండు ప్రాణాలు బలి అయ్యాయి. రూపా రెడ్డిని హత్య చేసిన పిల్లలు కూడా జల్సాలు చేయడం కోసం, బైక్, సెల్ ఫోన్ కొనుక్కోవడం కోసమే దొంగతనం చేయాలనుకున్నారు. తమ ముఖానికి ఉన్న మాస్క్ జారిపోవడంతో ఆమె గుర్తుపడుతుందనే భయంతో పొడిచామని విచారణలో వెల్లడించారు. అయితే దొంగతనం చేయడానికే వెళ్లినప్పుడు అంత పెద్ద కత్తి ఎందుకు తీసుకువెళ్లారు? పైగా 27 సార్లు పొడిచారనే వార్త మరింత భయపెడుతున్నది. ఇంజెక్షన్ అంటేనే భయపడే వయసులో, మొదటి కత్తిపోటుకే వచ్చే రక్తాన్ని చూసి కూడా వెనకడుగు వేయకుండా 27 సార్లు పొడిచారంటే ఆ పిల్లల మనస్తత్వం ఎంత దారుణంగా తయారైందో అర్థం చేసుకోవచ్చు.ఉపాధ్యాయులు అంటే భయభక్తులు ఉండే రోజులు పోయాయి. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మధ్య ఆత్మీయ అనుబంధం కొరవడింది. ఉపాధ్యాయులను జోకర్లుగా చూపించే సినిమాలు కూడా వస్తున్నాయి. గతంలో పాఠశాలను వీడి వచ్చేటప్పుడు ఎన్నో తీపి జ్ఞాపకాలను వెంట తెచ్చుకునేవాళ్ళం. వీడ్కోలు సభ అంటే ఆ సంస్థతో మనకున్న అనుబంధానికి అద్దం పట్టే వేడుక. కానీ ఇప్పుడు అదొక ఈవెంట్‌గా మారిపోయింది. పిల్లల దగ్గర వేలకు వేలు వసూలు చేసి ఆర్భాటంగా నిర్వహించే వ్యాపారంగా మారింది. పిల్లలకు తాము చదువుకునే సంస్థ పట్ల ఎలాంటి గౌరవాభిమానాలు ఉండటం లేదు.రూపా రెడ్డి హత్య పిల్లల పెంపకంలో తల్లిదండ్రుల వైఫల్యాన్ని ఎత్తిచూపుతున్నది. అదే సమయంలో విద్యాసంస్థల నిర్వహణా లోపాన్ని కూడా స్పష్టం చేస్తున్నది. పిల్లల మనస్తత్వాన్ని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులే పసిగట్టలేకపోతే వారి భవిష్యత్తును ఎవరు తీర్చిదిద్దుతారు? చదువులో పోటీ పడవలసిన పిల్లలు సెల్ ఫోన్లు, బైకులు కొనుక్కోవడంలో పోటీ పడుతున్నారు అంటే దానికి ప్రధాన కారణం తల్లిదండ్రుల పెంపకమే. మార్కుల కోసం ఇతరులతో పోల్చడం మొదలుపెట్టగానే, ఆడంబరాల విషయంలోనూ పిల్లలు ఇతరులతో పోటీ పడుతున్నారు. అటువంటి వాటికి దూరంగా ఉండాలంటే పిల్లలను వాస్తవికతకు దగ్గరగా పెంచాలి. వారికి కష్టం తెలియకుండా పెంచాలనే కోరికతో నష్టం చేస్తున్నామనే నిజాన్ని గ్రహించకపోతే బాల నేరస్థుల సంఖ్య మరింత పెరిగిపోతుంది.జువైనల్ జస్టిస్ పరిధిలో ఉన్న ఆ ఇద్దరు పిల్లల తల్లిదండ్రుల పరిస్థితి అగమ్యగోచరం. తమ పిల్లల భవిష్యత్తుకు బంగారు బాట వేయాలనుకున్న ఆ తల్లిదండ్రుల వేదన వర్ణనాతీతం. తమ పిల్లలు హంతకులయ్యారన్న నిజాన్ని వారు జీర్ణించుకోలేరు; అలాగని వారిని వదులుకోనూ లేరు. ఇప్పటి నుండి వారికోసం న్యాయస్థానాల చుట్టూ తిరగాలి, సమాజం చూపే హేళన చూపులను భరించాలి. ఈ హత్య ఘటనపై స్పందిస్తూ ఉపాధ్యాయ సంఘాలు తమ రక్షణ పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.ఇక రెండో ఘటన... నూకరాజు కుటుంబం చేసుకున్న ఆత్మహత్య. నూకరాజు కుమార్తె సౌజన్య చేసిన ఒక చిన్న పొరపాటు ఆమెతో పాటు తల్లిదండ్రుల ప్రాణాలను కూడా బలితీసుకుంది. తన అల్లుడి మరణాన్ని తట్టుకుని నిలబడగలిగిన నూకరాజు, కూతురిపై సాదిక్ అనే వ్యక్తి చేస్తున్న వేధింపులను మాత్రం భరించలేకపోయారు. తండ్రీకూతుళ్లు ఆత్మహత్య చేసుకోవడానికి చూపిన ధైర్యాన్ని బ్రతకడానికి చూపిస్తే బాగుండేదని బయట వ్యక్తులుగా మనం సులువుగా చెప్పవచ్చు. కానీ చేసిన పొరపాటు నుండి ఎలా బయటపడాలో పాలుపోకనే వారు ఆత్మహత్య నిర్ణయం తీసుకుని ఉంటారు. ఇప్పుడు సానుభూతి చూపిస్తున్న బంధుమిత్రులకు ముందే సమస్యను చెప్పుంటే వారు ఎలా స్పందించేవారో తెలియదు. భారతీయ సమాజం ఇలాంటి సున్నితమైన సమస్యలను సామరస్యపూర్వక వాతావరణంలో అర్థం చేసుకునే స్థాయికి ఇంకా చేరలేదు. అలాగే, ఒక ప్రభుత్వ ఉద్యోగి అయ్యి ఉండి కూడా తన సమస్యను పోలీసులు పరిష్కరించగలరనే నమ్మకం లేకుండా పోయిందంటే వ్యవస్థలోని లోపాన్ని కూడా మనం గుర్తించాలి.ఈ రెండు ఉదంతాలలోనూ తల్లిదండ్రులే బాధితులుగా మారారు. కానీ, పిల్లలు చేసిన తప్పులలో పెద్దల బాధ్యత కూడా ఎంతోకొంత తప్పక ఉంటుంది. రూపా రెడ్డి హత్య కేసులో పిల్లల ప్రవర్తనను పసిగట్టని తల్లిదండ్రులు బాధ్యత వహించక తప్పదు. అదేవిధంగా నూకరాజు కూడా తన కుమార్తెకు జీవితంలోని ఆటంకాలను, అవరోధాలను ధైర్యంగా ఎదుర్కొనే మనోధైర్యాన్ని నూరిపోసి ఉంటే ఈ విషాదం జరిగి ఉండేది కాదు.!

- ఇంద్రాణి

## చరిత్రలో ఈ రోజు
### ఆగస్టు 28

28 AUG

* 1749 : జర్మనీ రచయిత గేథే జననం (మ.1832).
* 1901 : దక్షిణభారత దేశపు నేపథ్యగాయని కానుకొల్లు చంద్రమతి జననం.
* 1904 : ప్రముఖ స్వతంత్ర సమరయోధుడు, భారత పార్లమెంట్ మాజీ సభ్యులు దాట్ల సత్యనారాయణ రాజు జననం (మ.1973).
* 1934 : దక్షిణభారత దేశపు నేపథ్యగాయని ఆర్కాట్ పార్థసారధి కోమల జననం (మ.2024).
* 1958 : ప్రముఖ రచయిత, నటుడు, నాటక కర్త భమిడిపాటి కామేశ్వరరావు మరణం (జ.1897).
* 1959 : తెలుగు సినీరంగ నటుడు సుమన్ జననం. (చిత్రంలో)
* 1969 : ఫేస్‌బుక్ ముఖ్య ఆపరేటింగ్ అధికారిణి షెరిల్ శాండ్‌బర్గ్ జననం.
* 1983 : శ్రీలంక క్రికెట్ క్రీడాకారుడు. ఫాస్ట్ బౌలింగ్ వేయడంలో నేర్పరి లసిత్ మలింగ జననం.
* 1988 : ప్రముఖ రాజకీయ నాయకుడు చీకటి పరశురామనాయుడు మరణం (జ.1910).
* 2006 : రంగస్థల, సినిమా నటుడు, రచయిత, దర్శకుడు డి.వి.నరసరాజు మరణం (జ.1920).



సుమన్

## సీఆర్డీఏ సమావేశం.. పలు పరిపాలన
# అనుమతులకు ఆమోదం



అమరావతి: ఏపీ సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో 65వ సీఆర్డీఏ అథారిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వివిధ పరిపాలన అనుమతులకు ఆమోదం లభించింది. రూ.596 కోట్లతో లైబ్రరీ, కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం, రూ.1,430 కోట్లతో క్రిటికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటుకు అనుమతులు ఇచ్చినట్లు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ పేర్కొన్నారు. 29 గ్రామాల లేఅవుట్ రోడ్లను బీటీగా అభివృద్ధి చేసేందుకు ఆమోదం తెలిపారు. అమరావతి నుంచి మంగళగిరికి తాగునీరు అందించేందుకు అంగీకరించారు. డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టమ్ డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్‌కు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్, ఐఓసీఎల్ గ్రీన్ ఎనర్జీ అభివృద్ధికి కూడా అనుమతులు ఇచ్చినట్లు మంత్రి నారాయణ వెల్లడించారు. 2026 జనవరి 6లోపు రుణాలు తీసుకున్న రెండో దశ భూ సమీకరణ రైతులకు కూడా రుణమాఫీ వర్తింపజేసేందుకు సీఎం చంద్రబాబు అంగీకరించినట్లు తెలిపారు.

## పోలవరం పనులను జగన్ కొనసాగించి ఉంటే..
# ఇబ్బంది ఉండేది కాదు: అచ్చెన్నాయుడు




విజయవాడ: వైకాపా ప్రభుత్వ హయాంలో ఇరిగేషన్ ప్రాజెక్టులను సర్వనాశనం చేశారని మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. ఆనాడు సీఎంగా ఉన్న జగన్ పోలవరం ప్రాజెక్ట్ పనులను కొనసాగించి ఉంటే ఎల్‌నినోలు ఎన్ని వచ్చినా రైతులకు ఇబ్బంది ఉండేది కాదన్నారు. గురువారం మంత్రి అచ్చెన్నాయుడు మీడియాతో మాట్లాడారు. ''16 నెలల్లో హంద్రీనీవాపై రూ.3,500కోట్లు ఖర్చు చేసి కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాలకు నీళ్లు తీసుకెళ్లాం. 74 శాతం పూర్తి చేసిన పోలవరం ప్రాజెక్ట్‌ను అధికారంలోకి వచ్చాక వైకాపా ప్రభుత్వం ఒక ఏడాది పనులు కొనసాగించి ఉంటే పూర్తయ్యేది. ఆ ప్రాజెక్ట్ పూర్తయితే ఎల్‌నినోలు ఎన్ని వచ్చినా ఇబ్బంది ఉండకపోయేది. వైకాపా ప్రభుత్వం పోలవరాన్ని గోదావరి నదిలో ముంచేసింది. తాము మళ్లీ అధికారంలోకి వచ్చాక గాడిలో పెట్టాం. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల సమయంలో ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభించేందుకు ప్రయత్నిస్తున్నాం. 1995లో ఆనాటి సీఎంగా ఉన్న చంద్రబాబు వెలిగొండ ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన చేశారు. ఆ ప్రాజెక్ట్‌ను పూర్తి చేసి మళ్లీ ఆయనే జాతికి అంకితం చేయనున్నారు. తొండలు సైతం గుడ్లు పెట్టని ప్రాంతంలో వెలిగొండను చేపట్టాం. పుష్కర ఎత్తిపోతల ద్వారా గోదావరి జలాలు ఉత్తరాంధ్రను తాకబోతున్నాయి. 2019లో అధికారంలోకి వచ్చిన గొడ్డలి పార్టీ ప్రాజెక్టులను నాశనం చేయకపోయి ఉంటే, చంద్రబాబు సీఎంగా కొనసాగి ఉంటే ఈ సాగునీటి ప్రాజెక్టులన్నీ పూర్తయ్యేవి'' అని అచ్చెన్నాయుడు అన్నారు.

## రూ.3 లక్షలు లంచం తీసుకుంటూ
# పట్టుబడ్డ ఇరిగేషన్ అధికారులు

నెల్లూరు: నెల్లూరు జిల్లాలో ఇరిగేషన్ అధికారులు ఈఈ మహేశ్, డీఈ గౌతమ్‌సుమన్, ఏఈ నారాయణరాజు లంచం తీసుకుంటూ దొరికిపోయారు. రైతు అంబటి చిరంజీవి నుంచి రూ.3 లక్షల లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అధికారులు పట్టుకున్నారు. కలువాయి మండలం మద్దూరిపల్లికి చెందిన అంబటి చిరంజీవి తన పొలం వద్ద ఉన్న కాలువపై కల్వర్టు నిర్మించుకునేందుకు ఇరిగేషన్ శాఖ అధికారులను ఎన్వోసీ కోరారు. ఇందుకు వారు రూ.4 లక్షలు డిమాండ్ చేయగా.. రైతు చిరంజీవి ఏసీబీ అధికారులను సంప్రదించారు. ఈక్రమంలో

GOVERNMENT OF ANDHRA PRADESH
ANTI-CORRUPTION BUREAU
HONESTY OBJECTIVITY SINCERITY
ANTI-CORRUPTION BUREAU

ఇరిగేషన్ అధికారులు రూ.3 లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరికిపోయారు.

# 32వ రోజుకు 'ఇంటింటికీ తెలుగుదేశం'.. 88 లక్షల ఇళ్లకు టీడీపీ శ్రేణులు

- కొనసాగుతున్న 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం
- ఇప్పటివరకు 88.47 లక్షల ఇళ్లను సందర్శించిన టీడీపీ శ్రేణులు
- కూటమి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ ప్రజాభిప్రాయ సేకరణ
- కార్యక్రమానికి ప్రజల నుంచి లభిస్తున్న విశేష స్పందన

తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ఇంటింటికీ తెలుగుదేశం - 2 ఏళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా కొనసాగుతోంది. గురువారంతో ఈ కార్యక్రమం 32వ రోజుకు చేరుకుంది. ఇప్పటివరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 88.47 లక్షల కుటుంబాలను నేరుగా కలిశారు. కేవలం గురువారం ఒక్కరోజే 2,23,618 ఇళ్లను సందర్శించి రికార్డు సృష్టించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా, ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడమే లక్ష్యంగా టీడీపీ ముందుకు సాగుతోంది. అదే సమయంలో, ప్రభుత్వ పనితీరుపై ప్రజల అభిప్రాయాలను, స్థానిక సమస్యలను నేరుగా తెలుసుకుంటున్నారు. పార్టీ శ్రేణులు ప్రతి గడపకూ వెళ్లి, ఆయా కుటుంబాలకు అందుతున్న ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను వివరిస్తున్నారు.




ముఖ్యంగా రైతులు, మహిళలు, యువత, పేదలు, మధ్యతరగతి వర్గాలకు ప్రభుత్వం అందిస్తున్న చేయూతను తెలియజేస్తున్నారు. ప్రజల నుంచి వస్తున్న అపూర్వ స్పందనతో ఈ కార్యక్రమం మరింత ఉత్సాహంగా సాగుతోంది. కేవలం పార్టీ నాయకులు, కార్యకర్తలే కాకుండా ప్రజలు కూడా పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా పాల్గొంటున్నారు. తమ సమస్యలను నేరుగా నాయకుల దృష్టికి తీసుకెళ్తూ, పలు సూచనలు కూడా అందిస్తున్నారు. ప్రజా భాగస్వామ్యంతో 'ఇంటింటికీ తెలుగుదేశం' ఒక ఉద్యమంలా మారిందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

## మాతృభాష వికాసానికి 'సీటీఏ' కృషి అభినందనీయం: ఎం.వెంకయ్య నాయుడు

చెన్నై (టీనగర్): పొరుగు రాష్ట్రంలో ఉంటూ మాతృభాష వికాసానికి 'చెన్నపురి తెలుగు అకాడమీ (సీటీఏ)' నిరంతరం శ్రమించడం అభినందనీయమని పూర్వ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. చెన్నై లోక్‌భవన్‌లో చెన్నైపురి తెలుగు అకాడమీ ఆధ్వర్యంలో తూమాటి సంజీవరావు సంపాదకత్వంలో ప్రచురించిన 'శిష్ట, విశిష్ట తెలుగు విజయోత్సవాలు' గ్రంథాన్ని ఎం.వెంకయ్య నాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమిళనాడులో నివసిస్తున్నప్పటికీ తెలుగు ప్రాచీన భాషా హోదా సాధనలో



సంజీవరావు చూపిన చొరవ ప్రశంసనీయమన్నారు. 197173 కాలంలో 'ఆంధ్ర విశ్వకళా పరిషత్తు' ప్రచురించిన చారిత్రక 'శిష్ట వ్యవహారిక భాష' నివేదికను పునఃముద్రించడం ముదావహమన్నారు. తెలుగుకు ప్రాచీన హోదా దక్కి పదేళ్లయిన సందర్భంగా ఈ గ్రంథాన్ని తీసుకురావడం సమయోచితమని పేర్కొన్నారు. ఈ పుస్తకం యువతకు చేరువై, భాషా సంస్కృతుల పరిరక్షణకు దిక్సూచిలా నిలుస్తుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యావేత్తలు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

## హారన్ కొట్టారని.. పెళ్లిబృందంపై యువకుల దాడి

అన్నవరం: అన్నవరం దేవస్థానం సత్యగిరిపై కొందరు యువకులు ఓ పెళ్లిబృందంపై దాడి చేసి గంటన్నర పాటు వీరంగం సృష్టించారు. అడ్డుకున్న వారిని, మహిళలను, భద్రతా సిబ్బందిని లెక్కచేయకుండా చెలరేగిపోయారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం అర్ధరాత్రి సత్యగిరిపై అధిక సంఖ్యలో వివాహాలు జరిగాయి. ఉచిత కల్యాణ మండపాల ఎదురుగా ఉన్న రోడ్డులో వాహనాలు భారీగా బారులు తీరాయి. ఓ వివాహానికి రాత్రి 1.30 గంటల సమయంలో కార్లలో వచ్చిన అనకాపల్లి జిల్లా నర్సీపట్నానికి



చెందిన యువకులు.. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం శరభవరం గ్రామానికి చెందిన పెళ్లి బృందం కారును పక్కకు తీయాలంటూ పెద్దగా హారన్ మోగించారు. హారన్ వల్ల పిల్లలు ఇబ్బందిపడుతున్నారని సదరు కారులో ఉన్న వారు పేర్కొనడంతో ఒక్కసారిగా యువకులు రెచ్చిపోయి దాడికి దిగారు. కారు పార్కు చేసి వచ్చి, పెళ్లి బృందం ఉన్న కల్యాణ మండపం వద్దకు మరోసారి వెళ్లి దౌర్జన్యానికి దిగారు. కర్రలతో దాడి చేశారని, అడ్డుకున్న మహిళలపైనా తిరగబడటంతో ఓ మహిళ కిందపడిపోయారని, దేవస్థానం భద్రతా సిబ్బంది ఒకరు అడ్డుకోవడంతో ఆయన పైనా దాడికి పాల్పడినట్లు అక్కడున్న వారు తెలిపారు. కాసేపటి తర్వాత హరిహరసదన్ వసతిసముదాయంలోకి వెళ్లి పెళ్లి బృందంలోని వారిపై మరోసారి దాడికి పాల్పడ్డారు. రిసెప్షన్ వద్ద ఒకరిపై పిడిగుద్దులతో విరుచుకుపడ్డారు. తెల్లవారుజామున 3 గంటల వరకు జరిగిన ఈ ఘటనతో పెళ్లి బృందాలు ఆందోళనకు గురయ్యాయి. ముగ్గురు యువకులపై న్యూసెన్స్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## మార్కాపురంలో దారుణం.. హత్య చేసి పొలంలో పాతిపెట్టిన మహిళ

అర్ధవీడు: మార్కాపురం జిల్లాలోని అర్ధవీడు మండల కేంద్రంలో మహిళ అదృశ్యం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వమని అడగడంతో ఓ మహిళ మరో మహిళను హత్య చేసింది. వివరాల్లోకి వెళ్తే.. పెద్దారవీడు మండలం ప్రగల్లపాడు గ్రామానికి చెందిన ఆదిలక్ష్మి (32) అదృశ్యమైనట్లు కుటుంబసభ్యులు జులై 21న పెద్దారవీడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదృశ్యం కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ఆదిలక్ష్మి మరో మహిళకు అధిక వడ్డీకి రూ.50 లక్షలు ఇచ్చినట్లు పోలీసులు గుర్తించారు. ఆ దిశగా దర్యాప్తు చేపట్టగా హత్య విషయం వెలుగులోకి వచ్చింది. తనకు ఇచ్చిన డబ్బును తిరిగి ఇవ్వమని అడగడంతోనే ఆదిలక్ష్మిని హత్య చేసినట్లు నిందితురాలు అంగీకరించినట్లు తెలుస్తోంది. తనను ఇంటికి పిలిపించుకొని హత్య చేసి.. ప్లాస్టిక్ డబ్బాలో పెట్టి.. పొలంలో



పాతిపెట్టినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితురాలు ఇచ్చిన సమాచారంతో మహిళను పాతిపెట్టిన పొలం పరిసరాలను కంభం సీఐ మల్లికార్జున, అర్ధవీడు ఎస్సై నాంచారయ్య, పోలీసు సిబ్బంది పరిశీలించారు. నిందితురాలితో పాటు ఆమె కుమారుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. క్లూస్ టీమ్, ఫోరెన్సిక్ బృందం సాయంతో మృతదేహాన్ని బయటకు తీసేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు.

## నేపాల్ వరదలు.. ఏపీ, తెలంగాణకు చెందిన 29 మంది గల్లంతు

- నేపాల్ వరదల్లో చిక్కుకున్న తెలుగు రాష్ట్రాల యాత్రికులు
- ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏడుగురు, తెలంగాణకు చెందిన 22 మంది గల్లంతు
- యాత్రికుల భద్రతపై చంద్రబాబు, రేవంత్ రెడ్డి సమీక్షలు
- బాధితుల సహాయం కోసం ఢిల్లీలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు
- కేంద్ర ప్రభుత్వం, రాయబార కార్యాలయాలతో సమన్వయం



నేపాల్‌ను ముంచెత్తిన ఆకస్మిక వరదలు కైలాస మానస సరోవర యాత్రకు వెళ్లిన తెలుగు రాష్ట్రాల యాత్రికులను తీవ్ర కష్టాల్లోకి నెట్టాయి. ఈ విపత్తు కారణంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏడుగురు, తెలంగాణకు చెందిన 22 మందితో సహా మొత్తం 29 మంది ఆచూకీ ఇంకా లభించలేదని అధికారులు గురువారం తెలిపారు. వీరిని సురక్షితంగా వెనక్కి తీసుకురావడానికి ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏడుగురు యాత్రికుల ఆచూకీ తెలియరాలేదని, మరో 34 మంది సురక్షితంగా ఉన్నారని అధికారులు వెల్లడించారు. కర్నూలు ఆదోనికి చెందిన నలుగురు టిబెట్‌లో క్షేమంగా ఉండగా, తిరుపతి ప్రాంతానికి చెందిన 28 మంది యాత్రికులు ఖాట్మండులో సురక్షితంగా ఉన్నట్లు రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (RTGS) ద్వారా సంప్రదించి నిర్ధారించుకున్నారు. గల్లంతైన ఏడుగురిలో చిత్తూరు, విజయవాడ, కాకినాడ, గుంటూరుకు చెందిన వారున్నారు. వీరిలో ముగ్గురు ఈశా ఫౌండేషన్ నిర్వహించిన యాత్రలో పాల్గొన్నారని, వారి ఫోన్లు స్విచ్ ఆఫ్ వస్తున్నాయని తెలిపారు. ఈ పరిణామాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. వరదల్లో చిక్కుకున్న వారిని సురక్షితంగా తీసుకురావడమే ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. బాధితుల వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకుని, వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం, ఖాట్మండు, చైనాలలోని భారత రాయబార కార్యాలయాలతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని సూచించారు. రోడ్డు, వాయు మార్గాల పునరుద్ధరణతో పాటు, అవసరమైతే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా యాత్రికులను తరలించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. సహాయక చర్యల కోసం ఢిల్లీలోని ఏపీ భవన్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. తెలంగాణకు చెందిన 22 మంది యాత్రికుల ఆచూకీ ఇంకా తెలియాల్సి ఉందని రాష్ట్ర ప్రభుత్వ అధికారులు తెలిపారు. మొదట 23 మంది గల్లంతైనట్లు భావించినా, రంగారెడ్డి జిల్లాకు చెందిన ఒక యాత్రికుడు తన కుటుంబంతో మాట్లాడటంతో అతను సురక్షితంగా ఉన్నట్లు తేలింది. గల్లంతైన వారిలో ఆరుగురు తెలంగాణకు చెందినవారు కాగా, 17 మంది తెలంగాణ మూలాలున్న ఎన్నారైలు. వీరిలో చాలామంది నేపాల్‌టిబెట్ సరిహద్దులోని రసువా, రసువాగఢి, గైరాంగ్ వంటి ప్రాంతాల్లో ఉన్నట్లు చివరిసారిగా తెలిసిందని అధికారులు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఢిల్లీలోని తెలంగాణ భవన్, హైదరాబాద్‌లోని సచివాలయంలో హెల్ప్‌లైన్‌లను ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు దాదాపు 80 100 కాల్స్ వచ్చినట్లు తెలిపారు. తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ స్వయంగా పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. కేంద్ర విదేశాంగ శాఖ, భారత రాయబార కార్యాలయాలతో సమన్వయం చేసుకుంటూ గల్లంతైన వారిని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. బాధితుల కుటుంబాలు, ట్రావెల్ ఆపరేటర్ల నుంచి వచ్చిన సమాచారాన్ని ధ్రువీకరించుకుంటూ సహాయక చర్యలను వేగవంతం చేసినట్లు ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది.

## నో మైనింగ్ జోన్‌గా పంచదార్ల కొండ.. ప్రభుత్వం ఉత్తర్వులు

అనకాపల్లి: అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండల పరిధిలోని పంచదార్ల కొండను నో మైనింగ్ జోన్‌గా ఏపీ ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు 2.153 హెక్టార్ల విస్తీర్ణాన్ని నో మైనింగ్ జోన్‌గా ప్రకటిస్తూ గనుల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. పంచదార్ల కొండపై పురాతన ఆలయం, ప్రకృతి వనరుల సంరక్షణకు 'నో మైనింగ్ జోన్'గా ప్రకటించాలని రెవెన్యూ, మైనింగ్ శాఖలను ఇటీవల ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే ఉత్తర్వులు



వెలువడ్డాయి.

## ఎమ్మెల్యే కుమార్తె వివాహ వేడుకకు హాజరైన మంత్రి నారా లోకేశ్

- ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి కుమార్తె వివాహానికి హాజరైన మంత్రి లోకేశ్
- విశాఖలో జరిగిన వేడుకలో నూతన వధూవరులను ఆశీర్వదించిన లోకేశ్
- అంతకుముందు మంగళగిరిలో మరో శుభకార్యానికి హాజరు
- సీనియర్ ఐఏఎస్ అధికారి భట్టు అంబేద్కర్ కుమార్తె నిశ్చితార్థంలో పాల్గొన్న మంత్రి

రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ గురువారం పలు శుభకార్యాల్లో పాల్గొన్నారు. శృంగవరపుకోట (ఎస్.కోట) ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి కుమార్తె వివాహ వేడుకకు ఆయన హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం (ఏయూ) కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ వివాహ వేడుకలో వధూవరులు అస్మిత నాయుడు, పవన్ మౌళీలకు మంత్రి లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. వారి వైవాహిక జీవితం సంతోషంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలను ఆయన సోషల్ మీడియాలో పంచుకున్నారు. అంతకుముందు, మంత్రి లోకేశ్ మంగళగిరిలో జరిగిన మరో కార్యక్రమానికి కూడా హాజరయ్యారు. సీనియర్ ఐఏఎస్ అధికారి భట్టు అంబేద్కర్ కుమార్తె జెహోరికరాహుల్ దీప్ నిశ్చితార్థ వేడుకలో పాల్గొని, కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు.







## ఏపీకి చెందిన ఐదుగురి ఆచూకీ తెలియాల్సి ఉంది: మంత్రి కొండపల్లి

అమరావతి: నేపాల్ వెళ్లిన ఏపీకి చెందిన ఐదుగురి ఆచూకీ ఇంకా లభ్యం కాలేదని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ప్రకాశం జిల్లాకు చెందిన సుహాసిని రెడ్డి, కృష్ణా జిల్లాకు చెందిన రమేశ్‌బాబు, కాకినాడ జిల్లాకు చెందిన మరో ముగ్గురి ఆచూకీ తెలియాల్సి ఉందన్నారు. మానసరోవర్ యాత్రకు వెళ్లిన కర్నూలు జిల్లా ఆదోని వాసులు సురక్షితంగా ఉన్నారని, వారిని క్షేమంగా తీసుకొస్తామన్నారు. నేపాల్‌లో చిక్కుకుపోయిన తెలుగు యాత్రికులను సురక్షితంగా తీసుకొచ్చేలా సంప్రదింపులు జరుపుతున్నట్లు మంత్రి తెలిపారు. యాత్రికుల వివరాలను నేపాల్‌లోని భారత రాయబార



కార్యాలయానికి ఏపీఎన్ఆర్టీఎస్ అధికారులు అందించారని పేర్కొన్నారు. నేపాల్‌లో చిక్కుకున్న ఏపీ యాత్రికుల భద్రతపై మంత్రి లోకేశ్ పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించారు.

# నకిలీ వైద్యులపై కఠిన నిఘా.. హైదరాబాద్ లో 12 మంది అరెస్ట్.. సజ్జనార్ తీవ్ర హెచ్చరిక

- నకిలీ వైద్యులపై హైదరాబాద్ పోలీసుల ఉక్కుపాదం
- విద్యార్హతలు లేని కొందరు డాక్టర్లమంటూ చెలామణి అవుతున్నారన్న సజ్జనార్
- నకిలీ డాక్టర్ల బారిన పడొద్దని ప్రజలకు హెచ్చరిక

వైద్యం పేరుతో అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న నకిలీ వైద్యులపై హైదరాబాద్ నగర పోలీసులు ఉక్కుపాదం మోపారు. నగరంలో కనీస అర్హతలు లేకుండా క్లినిక్‌లు నిర్వహిస్తున్న నకిలీ వైద్యులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, ఇప్పటివరకు 12 మందిని గుర్తించి కఠిన చర్యలు తీసుకున్నామని పోలీస్ కమిషనర్ సజ్జనార్ వెల్లడించారు. కనీస వైద్య విద్యార్హతలు, ఎలాంటి పరిజ్ఞానం లేని కొందరు వ్యక్తులు తాము డాక్టర్లమంటూ చెలామణి అవుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఉన్న రోగులకు విచక్షణారహితంగా యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్లు, బీపీ, డయాబెటిస్ మందులను ఇస్తూ, ఇష్టారీతిన ఇంజక్షన్లు, సెలైన్లు ఎక్కిస్తున్నారని తెలిపారు. ఇటువంటి శాస్త్రీయత లేని వైద్యం వల్ల బాధితుల



ఊపిరితిత్తులు, గుండె, మూత్రపిండాలు దెబ్బతిని ప్రాణాలకే ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ సందర్భంగా నకిలీ డాక్టర్ల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీ సజ్జనార్ సూచించారు. క్లినిక్ లేదా ఆసుపత్రి రిసెప్షన్ వద్ద డిస్ట్రిక్ట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ జారీ చేసిన అధికారిక రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఉందో లేదో కచ్చితంగా గమనించాలని తెలిపారు. అలాగే వైద్యుడి బోర్డుపై పేరు, చదివిన విద్యార్హతలతో పాటు తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ నంబర్ తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. ఒకవేళ వైద్యుడి అర్హతలపై కొద్దిగా అనుమానం వచ్చినా అధికారిక వెబ్‌సైట్ ద్వారా వివరాలు చెక్ చేసుకోవచ్చని, రికార్డుల్లో వివరాలు కనిపించకపోతే ఆ వైద్యుడిని నకిలీగా పరిగణించవచ్చని స్పష్టం చేశారు. తీసుకుంటున్న చికిత్సపై సందేహాలు ఉంటే వెంటనే అర్హత కలిగిన మరో డాక్టర్ వద్ద 'సెకండ్ ఒపీనియన్' తీసుకోవాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమాజంలో ఎవరైనా నకిలీ వైద్యులు చలామణి అవుతున్నట్లు తెలిస్తే వెంటనే 'డయల్ 112' కి గానీ, స్థానిక పోలీస్ స్టేషన్‌కు గానీ సమాచారం అందించాలని కోరారు. ప్రజల ప్రాణాలతో ఆడుకునే నకిలీ డాక్టర్లపై నిరంతరం తనిఖీలు, కఠిన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# నేపాల్‌లో మేం క్షేమంగానే ఉన్నాం

**: డీఆర్‌డీవో మాజీ చైర్మన్ సతీశ్‌రెడ్డి**

నేపాల్‌లో తాము క్షేమంగానే ఉన్నామని డీఆర్‌డీవో మాజీ చైర్మన్ సతీశ్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం మానససరోవర్ యాత్రకు వెళ్తున్నట్లు వివరించారు. నిన్న నేపాల్‌లో వరదలు వచ్చిన ప్రాంతాన్ని దాటి ముందుకెళ్లామన్నారు. నేపాల్‌లో సంభవించిన ఆకస్మిక



జలప్రళయం తీవ్ర విషాదాన్ని నింపింది. విపత్తు నిర్వహణ సంస్థ తెలిపిన వివరాల ప్రకారం.. ఆకస్మిక వరదల కారణంగా 826 మంది ఆచూకీ గల్లంతయ్యింది. దాదాపు 300 మంది వరకు భారతీయులు కొట్టుకుపోయినట్లు నేపాల్ విదేశాంగ శాఖ మంత్రి శిశిర్ ఖనాల్ గురువారం వెల్లడించారు. ఈ విషాదంలో మృతుల సంఖ్య 175కు పెరిగింది.

# ఏపీ లిక్కర్ స్కామ్.. సిట్, ఈడీ అధికారులతో ఐటీ అధికారుల కీలక సమావేశం!

- ఏపీ లిక్కర్ స్కామ్ లో రంగంలోకి దిగిన ఐటీ శాఖ
- విదేశాలకు, బినామీ కంపెనీలకు నగదు మళ్లించినట్టు ఇప్పటికే గుర్తించిన దర్యాప్తు అధికారులు
- చట్టపరమైన చర్యలు, దాడులకు సిద్ధమవుతున్న ఐటీ అధికారులు

ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో ఆదాయపు పన్ను శాఖ రంగంలోకి దిగడంతో దర్యాప్తు కొత్త మలుపు తిరిగింది. ఈ కుంభకోణంలో అక్రమంగా కొల్లగొట్టిన నిధుల మూలాలు, వాటి మళ్లింపుపై ఐటీ




అధికారులు ఆరా తీస్తున్నారు. మనీ ట్రయల్‌కు సంబంధించిన కీలక వివరాలను సేకరించేందుకు హైదరాబాద్ వేదికగా సిట్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులతో ఐటీ ఉన్నతాధికారులు సమావేశమయ్యారు. షెల్ కంపెనీలను సృష్టించి కోట్లాది రూపాయల నగదును విదేశాలకు మళ్లించినట్లు దర్యాప్తు అధికారులు ఇదివరకే గుర్తించారు. ముఖ్యంగా దుబాయ్ సహా పలు ఇతర దేశాలకు, బినామీ కంపెనీలకు ఈ సొత్తును తరలించినట్లు తేలడంతో... ఆయా కంపెనీల నెట్‌వర్క్, వాటి వెనుక ఉన్న అసలు సూత్రధారులపై ఐటీ దృష్టి సారించింది. అసలు, నిధులు ఏ ఏ ఖాతాల గుండా ఎక్కడికి చేరాయి, విదేశీ ఖాతాలకు, బినామీ సంస్థలకు సొమ్మును ఏ రూపంలో తరలించారనే అంశాలపై ఐటీ అధికారులు దృష్టి సారించారు. ఈ దర్యాప్తు ప్రక్రియలో భాగంగా ప్రధాన నిందితులు, డొల్ల కంపెనీల జాబితా, అనుమానాస్పద బ్యాంకు ఖాతాల వివరాలను ఐటీ అధికారులు తీసుకున్నారు. ఈ కుంభకోణంతో పరోక్షంగా ప్రమేయం ఉన్న ఇతర వ్యక్తులు, ఆర్థిక లావాదేవీలకు సహకరించిన శక్తుల సమాచారాన్ని కూడా సేకరిస్తున్నారు. సిట్, ఈడీ అందించిన ఆధారాలు, నివేదికల ఆధారంగా త్వరలోనే సంబంధిత వ్యక్తులు, సంస్థలపై కఠిన చట్టపరమైన చర్యలు, దాడులకు ఆదాయపు పన్ను శాఖ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

# కూటమి పాలనలో స్విమ్స్ అభివృద్ధి చేశాం: బీఆర్ నాయుడు

తిరుమల: సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు డాక్టర్ జగదీశ్‌ను తిరుపతి జిల్లా స్విమ్స్ డైరెక్టర్‌గా నియమించామని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. గురువారం స్విమ్స్ డైరెక్టర్‌గా జగదీశ్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ నాయుడు మాట్లాడుతూ.. జగదీశ్ అనుభవంతోపాటు గొప్ప పేరు, దూరదృష్టి ఉన్న వైద్యుడని అన్నారు. దేశం గర్వించదగిన వైద్యుల్లో ఆయన ఒకరన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్విమ్స్‌ను అభివృద్ధి చేసినట్లు చెప్పారు. స్విమ్స్, బర్డ్‌తోపాటు తితిదే వైద్యశాలల ద్వారా మెరుగైన వైద్య సదుపాయాలు కల్పిస్తామన్నారు. త్వరలో చిన్న పిల్లల సూపర్



స్పెషాలిటీ ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకొస్తామని వెల్లడించారు. అనంతరం డాక్టర్ జగదీశ్ మాట్లాడుతూ బీఆర్ నాయుడు ఉత్తర్వులతో బర్డ్, స్విమ్స్ ఆసుపత్రి డైరెక్టర్‌గా అవకాశం దక్కిందన్నారు.

# ఓటర్ల జాబితా సవరణ: ఫేక్ డాక్యుమెంట్లపై ఎన్నికల సంఘం గట్టి హెచ్చరిక

- ఓటర్ల జాబితా సవరణలో తప్పుడు పత్రాలిస్తే కఠిన చర్యలని హెచ్చరిక
- తెలంగాణ ఓటర్లకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి హెచ్చరిక
- రాష్ట్రవ్యాప్తంగా 92 లక్షల మందికి పైగా ఓటర్లకు నోటీసులు జారీ
- తప్పుడు సమాచారమిస్తే జైలు శిక్ష తప్పదని స్పష్టం




తెలంగాణలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఎవరైనా తప్పుడు పత్రాలు సమర్పిస్తే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) హెచ్చరించారు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారాన్ని, నకిలీ పత్రాలను సమర్పించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన ఆయన స్పష్టం చేశారు. ఓటర్లు సమర్పించే పత్రాలను, డిక్లరేషన్లను అధికారులు స్వతంత్రంగా ధ్రువీకరిస్తారని సీఈఓ కార్యాలయం వెల్లడించింది. ప్రభుత్వ అధికారికి తప్పుడు సమాచారం అందించడం భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని సెక్షన్ 217 ప్రకారం శిక్షార్హమని పేర్కొన్నారు. అదేవిధంగా, ఓటర్ల జాబితా సవరణలో తప్పుడు డిక్లరేషన్ ఇస్తే ప్రజాప్రాతినిధ్య చట్టం 1950లోని సెక్షన్ 31 ప్రకారం జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉందని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రక్రియలో భాగంగా ఇప్పటికే 2 లక్షల మందికి పైగా ఓటర్లకు నోటీసులు జారీ చేశారు. మొత్తం మీద 92.8 లక్షల మంది ఓటర్లకు నోటీసులు అందజేయనున్నారు. వీరిలో 60.5 లక్షల మంది ఓటర్ల డేటాలో వ్యత్యాసాలు ఉండగా, మరో 32.3 లక్షల మంది వివరాలు 2002 ఓటర్ల జాబితాతో సరిపోలడం లేదని అధికారులు గుర్తించారు. విచారణ సమయంలో ఓటర్లు గానీ, వారి కుటుంబ సభ్యులు గానీ తప్పనిసరిగా వ్యక్తిగతంగా హాజరు కావాలని అధికారులు సూచించారు. ఓటర్లు తమ వివరాల స్థితిని ఆన్‌లైన్‌లో మొబైల్ నంబర్‌తో లాగిన్ అయి, ఎపిక్ నంబర్ నమోదు చేసి, ఓటీపీ ద్వారా స్వయంగా ధ్రువీకరించుకోవచ్చని వెల్లడించారు.




# నేపాల్ వరదలు.. ఏపీ వాసుల కోసం దిల్లీలో కంట్రోల్‌రూమ్

అమరావతి: నేపాల్‌లో వరదల నేపథ్యంలో అక్కడ చిక్కుకున్న ఆంధ్రప్రదేశ్ వాసులను గుర్తించి, సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. నేపాల్‌లో ఏపీకి చెందిన ఎవరైనా విపత్తులో చిక్కుకున్నారా? అనే దానిపై ప్రభుత్వం సమాచారం సేకరిస్తోంది. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ బాధిత యాత్రికులకు అవసరమైన సహాయాన్ని అందించాలని సీఎం సూచించారు. దిల్లీలోని ఏపీ భవన్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ రూం ఏర్పాటు చేసి పరిస్థితి పర్యవేక్షిస్తున్నారు. ఆర్టీజీ ద్వారా కూడా నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తూ, నేపాల్‌లోని ఏపీ వాసులకు అవసరమైన సహకారం అందించాలని సీఎం ఆదేశించారు. సహాయం కోసం ఏపీ భవన్ కంట్రోల్ రూమ్ 011-2338 4016, 011-23387089 నంబర్లను, వాట్సాప్ 9059824101ను సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

# గవర్నర్‌కు అస్వస్థత.. పరామర్శించిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అస్వస్థతకు గురయ్యారు. బుధవారం ఉదయం ఛాతిలో అసౌకర్యంగా ఉండటంతో వెంటనే హైటెక్ సిటీలోని యశోద ఆసుపత్రిలో చేరారు. అత్యవసర విభాగంలో చేర్పించిన వైద్యులు ఆయనకు పలు పరీక్షలు చేశారు. కార్డియాలజిస్టు, ఎలక్ట్రోఫిజియాలజిస్టు డాక్టర్ వరదరాజశేఖర్ బృందం గవర్నర్‌కు వైద్య పరీక్షలు నిర్వహించగా.. గుండె రక్తనాళంలో ఒక బ్లాక్ ఉన్నట్లు గుర్తించారు. దాన్ని తొలగించేందుకు స్టంట్ వేశారు. గురువారం



ఆయన కోలుకోవడంతో ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశారు. అంతకుముందు గవర్నర్ ఆరోగ్యం గురించి సమాచారం తెలుసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి ఆసుపత్రికి వెళ్లి గవర్నర్‌ను పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వైద్యులతో మాట్లాడి గవర్నర్ ఆరోగ్యంపై ఆరా తీశారు. రక్తనాళంలో చిన్న బ్లాక్ ఉండటంతో స్టంట్ వేశామని, ఎలాంటి ఇబ్బంది లేదని వైద్యులు సీఎంకు వివరించారు.

# చిట్యాల ఫ్లైఓవర్ దసరా నాటికి పూర్తి చేయాలి

**: మంత్రి కోమటిరెడ్డి**

హైదరాబాద్: హైదరాబాద్‌విజయవాడ హైవేపై 17 బ్లాక్ స్పాట్లు ఉన్నచోట ఫ్లైఓవర్లు త్వరలో పూర్తి చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రహదారులపై మంత్రి గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. చిట్యాల ఫ్లైఓవర్ దసరా నాటికి పూర్తి చేయాలన్నారు. మిగతా ఫ్లైఓవర్లు డిసెంబర్ చివరి నాటికి అందుబాటులోకి తేవాలని సూచించారు. ప్రమాదాలు నివారించాలంటే రహదారి విస్తరణ



పనులు త్వరగా చేపట్టాలని పేర్కొన్నారు. 6+2 లేన్ల రహదారి విస్తరణ కోసం ఇప్పటికే కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని సీఎం రేవంత్‌రెడ్డి కలిసినట్లు కోమటిరెడ్డి తెలిపారు.

# ఆ ఇద్దరి వ్యవహారంపై అంతిమ నిర్ణయం ఏఐసీసీదే

**: మహేశ్‌కుమార్‌గౌడ్**

నిజామాబాద్ అర్బన్: రాష్ట్ర మంత్రి కొండా సురేఖతో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చిన్నారెడ్డి వ్యవహారంపై ఏఐసీసీ అంతిమ నిర్ణయం తీసుకోనుందని పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. నిజామాబాద్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వారిద్దరిపై క్రమశిక్షణ కమిటీ ఇచ్చిన నివేదికను పార్టీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌కు పంపించినట్లు తెలిపారు. ఏఐసీసీ ప్రకటన వచ్చేంత వరకు ఆ విషయంపై మాట్లాడబోమని స్పష్టం చేశారు. ఏదైనా విషయాన్ని చర్చించేందుకు కొండా మురళి తనతో భేటీ కావొచ్చని, ఇందులో ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. 22ఏ అంశంపై భాజపా, బీఆర్ఎస్‌లు అనవసర



రాద్ధాంతం చేస్తున్నాయని మండిపడ్డారు. ఈ విషయంలో తమ ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేందుకు ఆయా పార్టీల నాయకులు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ధరణి స్థానంలో తీసుకువచ్చిన భూభారతి చట్టం మంచి ఫలితం ఇస్తోందని వివరించారు.

# ఓయూకు రూ.వెయ్యి కోట్లు ఇస్తానని.. ఒక్క రూపాయి ఇవ్వలేదు

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ)కి రూ.వెయ్యి కోట్లు ఇస్తానని చెప్పి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు విమర్శించారు. హైదరాబాద్ తార్నాకలోని నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నిధులు ప్రకటించి ఏడాది గడిచినా..

**రూపాయి కూడా మంజూరు చేయలేదన్నారు.**

"టీచర్లకు జీతాలు ఇచ్చేందుకు డబ్బులు లేవని స్వయంగా సీఎం అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దారిలోనే.. కాంగ్రెస్ ప్రభుత్వం వెళ్తోంది. విద్యార్థుల విషయంలో మాట్లాడే అర్హత బీఆర్ఎస్‌కు లేదని చెప్తూనే ఉన్నాం. పాలిటెక్నిక్ కోర్సు కూడా స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సు. పాలిటెక్నిక్ విద్యార్థులు బీటెక్‌లోకి వెళ్లకుండా అడ్డుకోవటం సరికాదు. మీ నిర్ణయం సరైనది అయితే.. మళ్లీ కమిటీ ఎందుకు వేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పెట్టిన ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు రూ.15వేల కోట్లకు చేరాయి. యంగ్ ఇండియా స్కూల్స్ అని గొప్పగా చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవట్లేదు. పాలిటెక్నిక్ కాలేజీలను రద్దు చేసి.. భూములు స్వాధీనం చేసుకోవాలని చూస్తున్నారు.

# ఇప్పుడు ఎన్నికలు జరిగితే ఎన్డీయేకి 326 సీట్లు

* **ఇండియా టుడే-సీ ఓటర్ సర్వేలో వెల్లడి**
* **మోదీయే ప్రధాని కావాలంటున్నవారు 49%**

దిల్లీ: దేశంలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే ఎన్డీయే కూటమి 45% ఓట్లతో 326 లోక్‌సభ స్థానాలు చేజిక్కించుకుంటుందని ఇండియాటుడే సీ ఓటర్ 'మూడ్ ఆఫ్ ది నేషన్' సర్వే వెల్లడించింది. భాజపాకు 261, దాని భాగస్వామ్య పక్షాలకు 65 సీట్లు వస్తాయని తెలిపింది. ఏటా రెండుసార్లు ఇలాంటి సర్వే నిర్వహిస్తున్నారు. జనవరిలో చేపట్టిన సర్వేలో ఎన్డీయే కూటమికి 352 సీట్లు వస్తాయని అంచనా వేయగా, తాజాగా దానిలో 26 తగ్గాయి. ఇదే సమయంలో కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి 185 సీట్లు గెలుచుకుంటుందని తెలిపింది. గత జనవరిలో నిర్వహించిన సర్వే కంటే అది 3 సీట్లు లాభపడింది. అయితే 2024 ఎన్నికల్లో సాధించిన 234తో పోలిస్తే ప్రస్తుతానికి ఇండియా కూటమి 49 సీట్లు నష్టపోయినట్లు లెక్క. జులై 1 ఆగస్టు 25 మధ్య దేశవ్యాప్తంగా 25,184 మందిని నేరుగా సర్వే చేసినట్లు సీ ఓటర్ సంస్థ పేర్కొంది. గత ఆరునెలలుగా మరో 91,795 మందిని ఇంటర్వ్యూ చేస్తూ వచ్చామని, ఆ వివరాలను కూడా పరిగణనలోకి తీసుకున్నామని వెల్లడించింది. జెన్ జీ ఉద్యమాలు, పేపర్ లీక్‌లు, పరీక్షల నిర్వహణలో



అవకతవకల కారణంగా భాజపా ప్రతిష్ఠ కొంతమేర దెబ్బతిన్నట్లు పేర్కొంది. ఆ పార్టీ గెలిచే అవకాశం ఉన్న సీట్లు ఆరునెలల్లో 287 నుంచి 261కి తగ్గినట్లు తెలిపింది. ఇది 2024లో వచ్చిన 240 సీట్లకంటే ఎక్కువే అయినప్పటికీ, ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన సాధారణ మెజార్టీ కంటే 11 తక్కువని గుర్తుచేసింది.

**సెంచరీ దాటనున్న కాంగ్రెస్**

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన ప్రజా ఉద్యమాల కారణంగా జనవరిఆగస్టు మధ్య ఆ పార్టీ కొంత మెరుగుపడి సీట్ల సంఖ్య 80 నుంచి 106కి పెరిగినట్లు సంస్థ వెల్లడించింది. ఎన్డీయే కూటమికి 47% ఓట్లు వస్తాయని జనవరిలో భావించగా, ఇప్పుడు 45.1%కి తగ్గింది. ఇదే సమయంలో ఇండియా కూటమి ఓట్లు 39% నుంచి స్వల్పంగా (0.1%) పెరిగాయి. ప్రధానమంత్రి అభ్యర్థిగా 49% మంది మోదీని, 27% మంది రాహుల్‌గాంధీని ఇష్టపడ్డారు. తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ పార్టీకి ప్రస్తుతం పార్లమెంటులో ఒక్క ఎంపీ కూడా లేకపోయినా మూడో స్థానంలో (9%) నిలవడం విశేషం.

## రాఖీ పౌర్ణమి.. తెలంగాణలో 5 వేల ప్రత్యేక బస్సులు

హైదరాబాద్: రాఖీ పౌర్ణమి వేళ రద్దీ నేపథ్యంలో తెలంగాణ ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఐదు వేల ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు వెల్లడించింది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ విస్తృత ఏర్పాట్లు చేసినట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.




## తుమ్మిడిహట్టి బ్యారేజీ అంశం.. రెండు రాష్ట్రాలతో సమావేశం ఏర్పాటు

హైదరాబాద్: ప్రాణహిత నదిపై తుమ్మిడిహట్టి బ్యారేజీ అంశంపై కేంద్రం ప్రభుత్వం సమావేశం ఏర్పాటు చేసింది. సెప్టెంబర్ 1న కేంద్ర జల సంఘం ఛైర్మన్ అధ్యక్షతన ఈ సమావేశం జరగనుంది. తెలంగాణ, మహారాష్ట్ర అధికారులు, కేంద్ర ప్రభుత్వ సంస్థల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొననున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తితో ఈ సమావేశం ఏర్పాటు చేయడానికి కేంద్రం ముందుకొచ్చింది.



## కాంగ్రెస్‌కు దిల్లీలో ఒక నీతి.. తెలంగాణలో మరో నీతి: హరీశ్‌రావు

హనుమకొండ: పాలిటెక్నిక్ విద్యార్థుల పట్ల ప్రభుత్వం కర్కశంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు అన్నారు. హనుమకొండలో పాలిటెక్నిక్ విద్యార్థులు ఆయనను కలిసి తమ సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. 97 జీవోను రద్దు చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. తెలంగాణ విద్యార్థుల ఉద్యమాలు రాహుల్ గాంధీకి కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. జెన్‌జీ ఉద్యమాలపై కాంగ్రెస్‌కు దిల్లీలో ఒక నీతి.. తెలంగాణలో మరో నీతి ఏంటని దుయ్యబట్టారు. అంతకుముందు హనుమకొండలోని కలెక్టరేట్ వద్ద టీఎస్జీవోలు నిర్వహించిన ధర్నాలో ఎమ్మెల్యే హరీశ్‌రావు పాల్గొని మద్దతు తెలిపారు. దీంతో ఆయన్ను పోలీసులు అరెస్ట్ చేసి సుబేదారి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం విడుదల చేశారు.



## భూతల యుద్ధాల్లో ట్యాంకులే కీలకం: రాజ్‌నాథ్

జబల్‌పూర్: ఆధునిక యుద్ధాలలో డ్రోన్లు, క్షిపణుల పాత్ర పెరుగుతున్నప్పటికీ భూతల యుద్ధాల్లో ఇప్పటికీ ట్యాంకులు అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నాయని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఉద్ఘాటించారు. ట్యాంకులు దేశ సరిహద్దుల్లో ఇనుప గోడలా నిలుస్తూ మన సైనికుల మనోస్థైర్యం పెంచుతాయని వివరించారు. 57 ఏళ్ల చరిత్ర కలిగిన జబల్‌పూర్ వెహికల్ ఫ్యాక్టరీ ఆర్డినెన్స్ యూనిట్‌లో రూ.472 కోట్ల వ్యయంతో టీసిరీస్ యుద్ధ ట్యాంకుల మరమ్మతులు/పునరుద్ధరణ కేంద్ర నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. మన సైన్యం ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన బలగాలలో ఒకటని చెప్పారు. జబల్‌పూర్ కేంద్రం ద్వారా ఏటా 80 టి72, టి90 ట్యాంకులను ఓవర్‌హాల్ చేస్తారని సింగ్ తెలిపారు. సైన్యానికి ఏటా దాదాపు 230 ట్యాంకుల ఓవర్‌హాల్ అవసరం ఉందని ఆయన వివరించారు. తమిళనాడు, అవడిలోని హెవీ వెహికల్స్ ఫ్యాక్టరీ ప్రస్తుతం ఏటా దాదాపు 150 ట్యాంకులను ఓవర్‌హాల్ చేస్తోందని, మిగిలినవాటిని జబల్‌పూర్‌లో ఏర్పాటు చేస్తున్న కొత్త కేంద్రం చేస్తుందని రక్షణ మంత్రి చెప్పారు.



## వీసా ఉల్లంఘనలు.. ఒక్క నెలలోనే 49వేల మంది అరెస్టు

అమెరికాలో అక్రమ వలసదారులు, వీసా ఉల్లంఘనలకు పాల్పడుతున్న వారిపై ట్రంప్ యంత్రాంగం ఉక్కుపాదం మోపుతోంది. ఈ క్రమంలో నిత్యం వందలాది మందిని అదుపులోకి తీసుకోవడంతోపాటు అనేక మంది విదేశీయులను వెనక్కి పంపిస్తోంది. ఇందులో భాగంగా జులై నెలలోనే అత్యధికంగా 49వేల మందిని అరెస్టు చేసింది. ట్రంప్ రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత ఈ స్థాయిలో అరెస్టులు చేయడం ఇదే తొలిసారి అని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి.

## న్యూయార్క్‌లో భాగవత్ పర్యటనపై రాద్ధాంతం

* **రేపటి కార్యక్రమంలో నిరసనలకు సన్నాహాలు**
* **అప్రమత్తంగా ఉండండి.. ఘర్షణలకు దిగకండి: హెచ్ఏఎఫ్**
* **వీసా రద్దుకు యూఎస్‌సీఐఆర్ఎఫ్ డిమాండ్**

వాషింగ్టన్, న్యూయార్క్: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) అధినేత మోహన్ భాగవత్ శనివారం న్యూయార్క్‌లో పాల్గొనబోయే సమావేశంపై రాద్ధాంతం మొదలైంది. మూడు దేశాల పర్యటనలో భాగంగా ఆయన న్యూయార్క్ చేరుకున్నారు. నిరసనలకు బహిరంగంగానే పిలుపునివ్వడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,



కార్యకర్తలతో ఎలాంటి ఘర్షణలకు దిగవద్దని 'హిందూ అమెరికన్ ఫౌండేషన్' (హెచ్ఏఎఫ్) విజ్ఞప్తి చేసింది. కార్యక్రమ రద్దుకు, అవాంతరాలకు ప్రయత్నాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరించింది. హాజరయ్యేవారికి, పౌరహక్కులకు రక్షణ కల్పించాలని న్యూయార్క్ మేయర్ మమ్దానీని కోరింది. సభావేదిక వద్ద నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని 'హిందూస్ ఫర్ హ్యూమన్ రైట్స్', 'సేవ్ అమెరికా ఫ్రం హిందుత్వ', 'ఇండియన్ అమెరికన్ ముస్లిం కౌన్సిల్', 'దళిత్ సాలిడారిటీ ఫోరం' వంటి సంస్థలు సిద్ధమవుతున్నాయి. "భాగవత్ హిందువుల ప్రతినిధి కాదు. హింసకు ఆజ్యం పోయడం, బహిష్కారం, మైనారిటీ వర్గాల్లో భయం రేకెత్తించడం వంటివాటితో కూడిన అతివాద హిందూ జాతీయ ఉద్యమానికి ఆయన నేతృత్వం వహిస్తున్నారు" అని 'హిందూస్ ఫర్ హ్యూమన్ రైట్స్' డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రావ్య తాడేపల్లి ఆరోపించారు.

**ఆంక్షలు విధించాలి**

భాగవత్ వీసాను రద్దు చేయాలని ట్రంప్ సర్కారును 'అంతర్జాతీయ మత స్వేచ్ఛపై అమెరికా కమిషన్' (యూఎస్‌సీఐఆర్ఎఫ్) గట్టిగా కోరింది. మత స్వేచ్ఛ ఉల్లంఘనలకు పాల్పడినవారిపై ఆంక్షలు విధించే విషయం పరిశీలించాలని కోరామని సంస్థ అధ్యక్షుడు ఆసిఫ్ మహమూద్ తెలిపారు. ఆరెస్సెస్ సభ్యులు మతపరమైన మైనారిటీలపై హింసాత్మక దాడులకు పాల్పడ్డారని సంస్థ ఆరోపించింది. ఇది విశ్వసనీయత లేని పక్షపాతపూరిత సంస్థ అని భారత విదేశీ వ్యవహారాల శాఖ విమర్శించింది. భాగవత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సంస్థ ఎక్స్ హ్యాండిల్ కొన్ని గంటలసేపు స్తంభించిపోయింది. విషయాన్ని ఎక్స్ దృష్టికి తీసుకువెళ్లాక దానిని పునరుద్ధరించారు. పర్యటన యథావిధిగా కొనసాగుతుందని 'అమెరికన్ హిందూస్ ఫర్ ఎంగేజ్‌మెంట్ అండ్ డైలాగ్' (ఎహెడ్) సంస్థ తెలిపింది. కార్యక్రమానికి దాదాపు 200 సంస్థలు మద్దతు ఇస్తున్నాయి.

## నియోజకవర్గాల పునర్విభజనపై మీ ప్రణాళిక బహిర్గతం చేయండి

**ప్రధానికి ఖర్గే లేఖ**

దిల్లీ: లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటుచేసి ప్రభుత్వ ప్రణాళిక ఏమిటనేది పంచుకోవాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం ప్రధాని నరేంద్రమోదీని కోరారు. లోక్‌సభ స్థానాల సంఖ్యను ఇప్పుడున్న 543కే మరో పాతికేళ్లపాటు పరిమితం చేయాలన్నారు. రాష్ట్రాలవారీగా స్థానాల సంఖ్యను అప్పటివరకు ఇలాగే ఉంచాలని, 2029 సార్వత్రిక ఎన్నికల నుంచి 33% మహిళా రిజర్వేషన్లను అమలు చేసే బిల్లును ప్రవేశపెట్టాలని ప్రధానికి లేఖ రాశారు. "డీలిమిటేషన్ బిల్లుకోసం



ప్రత్యేకంగా పార్లమెంటు సమావేశాలు ఏర్పాటుచేసే అవకాశం ఉందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్‌రిజిజు బుధవారం రాత్రి ఓ ఇంటర్వ్యూలో ప్రకటించారు. వర్షాకాల సమావేశాలు ప్రొరోగ్ చేయకుండా సుదీర్ఘంగా జాప్యం చేయడానికి బహుశా ఇదే కారణమేమోనని అనిపిస్తోంది. మీరు ఒకవేళ బిల్లు తేవాలనుకుంటే అందరిముందు ప్రతిపాదనలను ఉంచండి. వాటిపై అధ్యయనం చేసి స్పందించడానికి పార్టీలకు, రాష్ట్రాలకు తగిన సమయం ఇవ్వండి" అని దీనిలో కోరారు. నియోజకవర్గాల పెంపు అంశం దేశానికి చాలా ముఖ్యమైంది కాబట్టి ఏప్రిల్ తరహాలో మాత్రం బలవంతంగా మరో ప్రయత్నం చేయొద్దని కోరారు.

## తుపాకులు పట్టిన చేతులు రాఖీలు తయారు చేశాయి

కాంకేర్: ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ జిల్లాలో గల చౌగేల్ గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రం కొందరి జీవితాల్లో శాంతి, గౌరవం, స్వయంసమృద్ధితో కూడిన కొత్త అధ్యాయాన్ని లిఖిస్తోంది. ఏళ్లతరబడి దట్టమైన అడవుల్లో తిరుగాడుతూ తుపాకులు పట్టిన ఆ చేతులు నేడు రంగురంగుల దారాలు, మెరిసేటి పూసలతో అందమైన రాఖీలు తయారు చేశాయి. లొంగిపోయిన మావోయిస్టులకు నైపుణ్య శిక్షణ ఇస్తున్న ఈ కేంద్రంలో 'రక్షాబంధన్' పండుగ కోసం వెయ్యికి పైగా రాఖీలను సిద్ధం చేశారు.



మార్కెటులో ఇవి అప్పుడే అమ్ముడుపోవడంతో శిక్షణ పొందుతున్నవారు తమ శ్రమకు తగిన ఆదాయాన్ని కూడా కళ్ల జూశారు. "పలు వృత్తుల్లో వీరికి శిక్షణ ఇస్తున్నాం. ఇప్పుడు రాఖీలు చేసినట్టే ఈ ఏడాది హోలీకి గులాల్ తయారుచేశారు" అని కాంకేర్ ఏఎస్పీ ఆకాశ్ శ్రీశ్రీమాల్ చెప్పారు. "అడవుల్లో బతికేటప్పుడు రక్షాబంధన్ గురించి వినడమే కానీ, ఎప్పుడూ చేసుకున్నది లేదు. ఈ ఏడాది ఇక్కడున్న భద్రతా సిబ్బందికి, మాతోటి శిక్షణార్థులకు రాఖీలు కట్టి పండుగ జరుపుకొంటాం" అని సునీతా అనే యువతి తెలిపారు.

## ప్రేమజంట బ్రేకప్‌తో పేపర్ లీకేజీ గుట్టురట్టు

ముంబయి: మహారాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎంపీఎస్సీ) నిర్వహించిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల నియామక పరీక్ష పేపర్ లీకేజీ కారణంగా రద్దు కాగా.. ఓ ప్రేమజంట బ్రేకప్‌తో ఈ 'లీకేజీ' బయటపడటం విశేషం. పరీక్షకు సిద్ధమవుతున్న తన కుమార్తె రుతుజ కోసం అమృత్ పాటిల్ (55) అనే వ్యక్తి ఓ మధ్యవర్తిని సంప్రదించి ప్రశ్నపత్రాన్ని సంపాదించాడు. మొత్తం రూ.12 లక్షలకు ఒప్పందం కుదరగా.. రూ.5 లక్షలు ముందుగా ఇచ్చారు. ఈ ప్రశ్నపత్రం ప్రకారం రుతుజ పరీక్షకు సిద్ధమైంది. పరీక్షకు రెండు రోజుల ముందు ఆ ప్రశ్నపత్రాన్ని తన ప్రియుడైన గౌరవ్ పాటిల్ (24)కు ఆమె వాట్సప్‌లో పంపింది. మార్చి 22న వీరిద్దరూ నియామక పరీక్ష రాయగా.. ఫలితాల్లో రుతుజకు ఏడో ర్యాంకు వచ్చింది. గౌరవ్ ఉత్తీర్ణత సాధించలేదు. ఈ విషయమై ప్రేమజంట మధ్య గొడవ జరిగి అది కాస్తా... బ్రేకప్‌కు దారితీసింది. రుతుజపై కోపంతో గౌరవ్.. పేపర్ లీకేజీ గురించి ఎంపీఎస్సీకి ఈమెయిల్ ద్వారా ఫిర్యాదు చేశాడు. ఆవేశం తగ్గాక.. ఆ ఫిర్యాదును వెనక్కి తీసుకునేందుకు ప్రయత్నించినా అప్పటికే కమిషన్ దర్యాప్తు మొదలైంది. అధికారులు తీగ లాగితే.. లీకేజీ డొంకంతా కదిలింది. ఈ కేసులో గౌరవ్, అమృత్ పాటిల్‌తోపాటు ప్రవీణ్ పాటిల్ (40) అనే మధ్యవర్తిని, ముగ్గురు ఎంపీఎస్సీ ఉద్యోగులను అరెస్టు చేసి.. రుతుజకు నోటీసు ఇచ్చారు.



## పీవోకే ప్రధానిగా పరాజిత అభ్యర్థి



లాహోర్: పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) ప్రధాన మంత్రి పదవికి న్యాయవాది ఇఫ్తికార్ జిలానీని పాకిస్థాన్ పాలక పీఎంఎల్ ఎన్ పార్టీ అధినేత నవాజ్ షరీఫ్ నామినేట్ చేసినట్లు సీనియర్ నేత గురువారం తెలిపారు. పీవోకే శాసనసభ శుక్రవారం లాంఛనంగా ప్రధాన మంత్రిని ఎన్నుకునే అవకాశం ఉంది. పీవోకే శాసనసభ ఎన్నికలు మూడు విడతలుగా జరిగాయి. హింసాత్మక నిరసనలు, భారీ రిగ్గింగ్ ఆరోపణల మధ్య ఇవి సాగాయి. ఇఫ్తికార్ జిలానీ ముజఫరాబాద్ నియోజకవర్గం నుంచి శాసనసభకు పోటీ చేసి పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ అభ్యర్థి సర్దార్ ముక్తార్ అహ్మద్ ఖాన్ అబ్బాసీ చేతిలో ఓడిపోయారు. ఎన్నికల సమయంలో జిలానీకి మద్దతుగా నవాజ్ షరీఫ్, ఆయన కుమార్తె.. పంజాబ్ ముఖ్యమంత్రి మరియం నవాజ్ ప్రచారం నిర్వహించినా, ఆయనకు ఓటమి తప్పలేదు. ఆ తర్వాత టెక్నోక్రాట్ స్థానం ద్వారా జిలానీ శాసనసభకు ఎన్నికయ్యారు. పీవోకే శాసనసభలో మొత్తం 53 స్థానాలు ఉండగా, వీటిలో 45 స్థానాలకు ప్రత్యక్ష ఎన్నికలు జరుగుతాయి. మిగతా ఎనిమిది స్థానాలను మహిళలు, టెక్నోక్రాట్లు, మతాధికారులకు కేటాయించారు.



# ఏం తీశారు బాసూ..

సినిమా ఇండస్ట్రీలో భారీ బడ్జెట్‌తో సినిమాలు తీయడం, అవి బాక్సాఫీస్ వద్ద విజయం సాధించడం సహజమే. అయితే కొన్నిసార్లు ఎంత పెద్ద స్టార్ కాస్టింగ్ ఉన్నా, కోట్లు కుమ్మరించినా సినిమాలు దారుణంగా ఫ్లాప్ అవుతుంటాయి. కానీ, ఏకంగా రూ. 45 కోట్ల బడ్జెట్‌తో నిర్మిస్తే.. థియేటర్లలో కేవలం రూ. 60 వేలు మాత్రమే వసూలు చేసిందంటే నమ్మగలరా? వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా ఇది పక్కా నిజం. భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత పెద్ద డిజాస్టర్‌గా నిలిచిన ఆ చిత్రం పేరు 'ది లేడీ కిల్లర్'. భారీ అంచనాలు, భారీ బడ్జెట్ మధ్య ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. 2023లో విడుదలైన ఈ క్రైమ్ థ్రిల్లర్ చిత్రంలో బాలీవుడ్ ప్రముఖ నటుడు అర్జున్ కపూర్, క్రేజీ హీరోయిన్ భూమి పెడ్నేకర్ జంటగా నటించారు. అజయ్ బహల్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ టీసిరీస్ బ్యానర్‌పై భారీ స్థాయిలో రూ. 45 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కించారు. స్టార్ హీరోహీరోయిన్లు, పెద్ద నిర్మాణ సంస్థ ఉండటంతో ఈ సినిమాపై విడుదల ముందు కొన్ని అంచనాలు ఉండేవి. కానీ థియేటర్లలో విడుదలైన మొదటి రోజే ఈ సినిమా పరిస్థితి ఘోరంగా తయారైంది. ఎంతలా అంటే, ఈ చిత్రానికి మొదటి రోజు దేశవ్యాప్తంగా అమ్ముడైన టికెట్లు కేవలం 293 మాత్రమే! మొదటి రోజు కలెక్షన్లు రూ. 38 వేలుగా నమోదయ్యాయి. ఇక ఈ సినిమా థియేట్రికల్ రన్ ముగిసేసరికి సాధించిన మొత్తం వసూళ్లు కేవలం రూ. 60 వేలు. అంటే పెట్టిన బడ్జెట్‌లో ఒక శాతం కాదు కదా, కనీసం ప్రింట్ అండ్ పబ్లిసిటీ ఖర్చులు కూడా రాలేదు.

సినిమా



# సుజయ్ ప్రొడక్షన్స్ & అర్ఎన్ క్రియేషన్స్ నూతన చిత్రం ప్రారంభం

యష్ తేజ్, జయశ్రీ జంటగా సుజయ్ ప్రొడక్షన్స్ బ్యానర్ లో అర్ఎన్ క్రియేషన్స్ సమర్పణలో చందు దర్శకత్వంలో కె గోపాల్, జె రవీందర్ నిర్మాతలుగా తెరకెక్కబోతున్న ప్రేమకథ చిత్రం పూజా కార్యక్రమాలతో ప్రారంభం అయ్యింది. ఈ కార్యక్రమంలో నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ్ కెమెరా స్విచ్ ఆన్ చెయ్యగా ముహూర్తం సన్నివేశానికి దర్శకుడు వివిఎన్ ఆదిత్య క్లాప్ కొట్టారు అలాగే మామిడి హరికృష్ణ స్క్రిప్ట్ ను చిత్ర యూనిట్ కు అందజేశారు. ప్రేమించుకొనే యువత తల్లి తండ్రులని దృష్టిలో ఉంచుకుంటే ఏం జరుగుతుంది? ప్రేమలో ఉన్న అబ్బాయి అమ్మాయి వారి పేరెంట్స్ గురుంచి ఎలా ఆలోచిస్తారు? వంటి సంఘటనలతో ఈ సినిమా కథాంశం ఉంటుందని దర్శకుడు చందు చెబుతున్నారు. ఒక సరికొత్త ప్రేమను తెరమీద ఆవిష్కరించబోతున్నందుకు ఆనందంగా ఉందని నిర్మాతలు కె గోపాల్, జె రవీందర్ తెలిపారు. ఈ చిత్రానికి ప్రొడక్షన్ డిజైనర్ భూపతి యాదగిరి, సంగీతం నాగ వంశీ, సినిమాటోగ్రఫీ నాని బిశెట్టి, సురేష్ జిల్లా, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఎర్రం రామకృష్ణ.

# టైటిల్ తెలిసేది ఆరోజే!



అగ్ర కథానాయకుడు అక్కినేని నాగార్జున కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకమైన 100వ చిత్రం షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నది. అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై రూపొందుతున్న ఈ చిత్రానికి రా కార్తీక్ దర్శకుడు. నిన్నేపెళ్లాడతా, ఆవిడా మా ఆవిడే చిత్రాల్లో నాగార్జునకు జోడీగా నటించిన టబు ఈ సినిమాలో కీలక పాత్ర పోషిస్తుండటం విశేషం. నాగార్జున పుట్టినరోజైన ఆగస్టు 29న ఈ సినిమా టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేయనున్నట్టు బుధవారం ఓ ప్రకటన ద్వారా మేకర్స్ తెలిపారు. అభిమానులు పండుగ చేసుకునేలా అద్భుతమైన టైటిల్‌ని ఈ సినిమాకు నిర్ణయించినట్టు వారు చెప్పారు. ఈ టైటిల్ గ్లింప్స్‌లోనే సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు కూడా వెల్లడికానున్నాయని వారు పేర్కొన్నారు. దేవిశ్రీ ప్రసాద్ ఈ చిత్రానికి సంగీత దర్శకత్వం వహిస్తున్న విషయం తెలిసిందే.

# "రోమాంచకం" మూవీ ట్రైలర్ లాంచ్



బ్లాక్ బస్టర్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా సమర్పణలో భద్రకాళి పిక్చర్స్ బ్యానర్ నిర్మిస్తున్న సినిమా "రోమాంచకం". సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్ కుమార్ జంటగా నటిస్తున్న ఈ చిత్రాన్ని ప్రణయ్ రెడ్డి వంగా నిర్మిస్తున్నారు. నూతన దర్శకుడు వేణుగోపాల్ రెడ్డి రూపొందిస్తున్నారు. ప్రేమ, హాస్యం, ఉత్కంఠ కలగలిపిన ఇంట్రెస్టింగ్ యూత్ ఫుల్ ఎంటర్ టైనర్ గా ప్రేక్షకుల్ని ఉర్రూతలూగించేందుకు ఈ సినిమా సెప్టెంబర్ 3న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఏషియన్ సినిమాస్ ద్వారా ఈ చిత్రాన్ని సునీల్ నారంగ్ ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటకలో రిలీజ్ చేస్తున్నారు. ఈ రోజు "రోమాంచకం" చిత్ర ట్రైలర్ లాంఛ్ ఈవెంట్ ను హైదరాబాద్ లో గ్రాండ్ గా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ అనంతిక సనిల్ కుమార్ మాట్లాడుతూ మా సినిమా చూసి ప్రతి ఒక్కరూ ప్రేమలో పడతారు. మా చిత్రాన్ని ప్రతి ఒక్కరూ ఇష్టపడతారు. ఈ సినిమాలో హీరోయిన్ గా నేను బాగుంటానని నమ్మి అవకాశం కల్పించిన మా డైరెక్టర్, ప్రొడ్యూసర్స్ కు థ్యాంక్స్. ఈ టీమ్ లోని అందరితో హ్యాపీగా వర్క్ చేశాను. ప్రేమ, హాస్యం, ఉత్కంఠ ఏంటో ఫీల్ కావాలంటే సెప్టెంబర్ 3న మా మూవీ చూసేందుకు థియేటర్స్ కు రండి. ఈ సినిమా సెట్ లో జాయిన్ అయిన మొదటి రోజు నుంచే పాజిటివ్ ఫీల్ తో వర్క్ చేశాం. అన్నారు. హీరో సుమంత్ ప్రభాస్ మాట్లాడుతూ సొంత బ్రదర్స్ లా నన్ను ఎంకరేజ్ చేస్తున్న మా సందీప్ అన్న, ప్రణయ్ అన్నకు థ్యాంక్స్. రోమాంచకం క్యూట్ లవ్ ఫిలిం. భద్రకాళీ సంస్థలో ట్రావెల్ అవుతుంటే తెలిసింది సందీప్ అన్న, ప్రణయ్ అన్న ఎంత మంచి మనసున్న వాళ్లో. యాక్టర్ గా ఓపెన్ అప్ అయిపోయి నటించే అందరినీ నవ్వించే అందరూ ఇష్టపడే ఇలాంటి బ్యూటిఫుల్ క్యారెక్టర్ లో నటించే అవకాశం నాకు కల్పించిన మా డైరెక్టర్ వేణు అన్నకు కృతజ్ఞతలు. అనంతిక మంచి పర్ ఫార్మర్, ఏ విద్య నేర్చుకోమన్నా త్వరగా నేర్చుకుంటుంది. సోహన్, వెంకటేష్, నరేంద్ర...ఇలా మా బ్యాచ్ అంతా నిజంగా స్నేహితులా అనేంత సహజంగా కనిపిస్తాం. నరేంద్ర చేసిన చింటు క్యారెక్టర్ మీ అందరికీ గుర్తుండిపోతుంది. ట్రైలర్ మీ అందరికీ నచ్చితే థియేటర్స్ కు వచ్చేయండి, మీతో పాటు మరికొందరిని తీసుకురండి. భద్రకాళీ పిక్చర్స్ లో వస్తున్న ఫన్ క్యూట్ ఎంటర్ టైనర్ ఇది. మీ ఫ్యామిలీ, ఫ్రెండ్స్ ఎవరితో చూసినా ఎంజాయ్ చేస్తారు. మీరు ఎవర్ని సినిమాకు తీసుకువెళ్లినా డిజప్పాయింట్ కారు. ఆ కాన్ఫిడెంట్ తో సినిమాకు వెళ్లండి. అన్నారు. ఈ సినిమాకు ఫ్యామిలీతో పాటు రండి. మ్యూజిక్ చాలా బాగుంది. సినిమా చూస్తున్నంత సేపు టైమ్ తెలియలేదు. అప్పుడే ఇంటర్వెల్ వచ్చిందా అనుకున్నా. ట్రైలర్ సరదాగా ఎలా ఉందో సినిమా కూడా అలాగే ఉంటుంది. ఈ సినిమాను డెఫనెట్ గా ప్రేక్షకులు చూస్తారు. సినిమా అంతా ఒక ఫ్లోలో కామెడీతో వెళ్తుంటుంది. ట్రైలర్ కోసం ఎక్కడ సీన్స్ కట్ చేయాలో తెలియలేదు. ఇలాంటి స్క్రిప్ట్ నేను రాయలేను. కామెడీకి ఎజెండా ఏమీ ఉండదు, నవ్వించాలి. సినిమాటిక్ అడ్వాంటేజ్ తీసుకోకుండా ఈ రోజుల్లో స్క్రిప్ట్ రాయడం కష్టం. కానీ ఈ సినిమాకు ఆ సినిమాటిక్ అడ్వాంటేజ్ చాలా తక్కువ తీసుకున్నారు. నాకు ఈ మూవీలో నచ్చిన విషయాల్లో అదొకటి. ప్రభాస్ అన్నతో సినిమా చేయడమే నా లైఫ్ లో రోమాంచకం మూవ్ మెంట్. అన్నారు.



# రెమ్యూనరేషన్ భారీగా డిమాండ్ చేసిన గ్లామర్ బ్యూటీ ?!

ప్రముఖ టీవీ సీరియల్ హీరోయిన్ సుహాసిని పేరు సైతం వినిపించింది. అంతేకాదు గుండె నిండ గుడి గంటలు సీరియల్ ఫేమ్ బాలు పేరు వినిపించగా.. తాను వెళ్లడం లేదని వీడియోతో క్లారిటీ ఇచ్చాడు బాలు. ఇక ఇప్పుడు మరో హీరోయిన్ పేరు వినిపిస్తుంది. ఆమె మరెవరో కాదు.. డెబ్జానీ మోదక్. ఈ పేరు గుర్తుందా.. ? తనే ఎన్నెన్నో జన్మల బంధం సీరియల్ ద్వారా తెలుగు తెరకు పరిచయం అయ్యింది. తెలుగు రాకపోయినప్పటికీ తనదైన నటనతో అడియన్స్ హృదయాలు గెలుచుకుంది ఈ బెంగాలీ ముద్దుగుమ్మ. అయితే ఆమెకు బిగ్ బాస్ కోసం వారానికి రూ. 4 లక్షల రెమ్యునరేషన్ ఇవ్వనున్నట్లు టాక్ వినిపిస్తుంది. తెలుగులో ఎన్నెన్నో జన్మల బంధం, సత్యభామ వంటి సీరియల్స్ ద్వారా మంచి పాపులారిటీ సంపాదించుకుంది. అయితే ఈ ముద్దుగుమ్మ ఫ్యామిలీ అడియన్స్ మాత్రమే కాకుండా యూత్ సైతం ఫ్యాన్స్ అయ్యారు. ఇక ఇటీవలే స్మాల్ స్క్రీన్ పై వచ్చే ఎంటర్టైన్మెంట్ షోలలో తన కామెడీ, ముద్దు ముద్దు మాటలతో ఆకట్టుకుంది. దీంతో ఇప్పుడు బిగ్ బాస్ 10లో డెబ్జానీ ఎంట్రీ ఇస్తుండడంతో ఎంటర్టైన్మెంట్ అదిరిపోతుందని.. ముఖ్యంగా యూత్ అట్రాక్షన్ ఎక్కువగానే ఉండనున్నట్లు తెలుస్తోంది. ఇక బిగ్ బాస్ 10లోకి సీరియల్ బ్యూటీ పల్లవి గౌడతోపాటు గుప్పెడంత మనసు ఫేమ్ రక్షిత సైతం ఎంట్రీ ఇవ్వనున్నట్లు టాక్. అలాగే జబర్దస్త్ ఫేమ్ నూకరాజు పేరు సైతం నెట్టింట వైరలవుతుంది. అయితే మరికొన్ని రోజుల్లో ఎవరెవరు హౌస్ లోకి అడుగుపెట్టనున్నారో క్లారిటీ రానుంది.